# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 30-8-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:29 | సంచిక: 22 | పేజీలు:6 | వెల: రూ.1/-


## ఉపాధి కోసం వెతికే పరిస్థితి నుంచి..ఉపాధి కల్పించే స్థాయికి..!

హైదరాబాద్, ఆగస్టు 29: దళితబంధు పథకం ఎంతో మంది పేద దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. దళితబంధులో భాగంగా చందానగర్ డివిజన్ అన్నపూర్ణ ఎన్‌క్లేవ్ హరిజన బస్తికి చెందిన జ్యోతికి మంజూరైన కిరాణ, జనరల్ స్టోర్‌ను ఆదివారం కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అదేవిధంగా చందానగర్ డివిజన్ వేమనకాలనీ వీకర్ సెక్షన్‌కు చెందిన మౌలాలికి మంజూరైన కారును కార్పొరేటర్ మంజులరెడ్డి, రోజాదేవిలతో కలిసి విప్ గాంధీ మియాపూర్‌లోని తన కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముందు చూపుతో దళితబంధును ప్రవేశపెట్టి దళితులను అభివృద్ధి పథంలోకి తీసుకువస్తున్నారని అన్నారు. దళితులు ఉపాధి కోసం వెతికే పరిస్థితి నుంచి మరింత మందికి ఉపాధినందించే స్థాయికి తీసుకువచ్చేందుకు ఈ పథకం ఎంతగానో తోడ్పాటునిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, నాయకులు మిర్యాల రాఘవరావు, నరేందర్, వరలక్ష్మి, మల్లేశ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి కలెక్టరేట్‌ను ప్రారంభించిన కేసీఆర్



పెద్దపల్లి , ఆగస్టు 29: పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్ నూతన కార్యాలయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లోని సీట్‌లో కలెక్టర్ సంగీతను కూర్చుండబెట్టారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు కలెక్టరేట్ వద్ద జిల్లా పోలీసుల నుంచి సీఎం గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని పెద్దకల్వల ఎస్సారెస్పీ క్యాంపు స్థలంలో 22 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో భవనాన్ని రూ.48.07 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించింది.

భవనంలో ఆరు బ్లాకులు, 98 గదులున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో 40, మొదటి అంతస్తులో 29, రెండో అంతస్తులో 29 గదులు నిర్మించారు. భవన సముదాయంలో 41 శాఖలకు కార్యాలయాలుండగా గ్రౌండ్ ఫ్లోర్‌లో సంక్షేమం, మత్స్య శాఖ, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు శాఖలకు సంబంధించిన ఛాంబర్లను ఏర్పాటుచేశారు. రూ.7 కోట్లతో పాలనాధికారి, అదనపు పాలనాధికారులకు సంబంధించిన క్యాంపు కార్యాలయాలు పూర్తి పూర్తవగా.. అధికారులు నివాసం ఉంటున్నారు. మరో ఎనిమిది మంది జిల్లాస్థాయి అధికారులు నివాస గృహాలు సైతం సిద్ధమయ్యాయి. కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి తలసాని



హైదరాబాద్, ఆగస్టు 29: ప్రైవేట్ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇటీవల జరిగిన బోనాల ఉత్సవాల నిర్వహణకు గాను 81 దేవాలయాలకు 21 లక్షల రూపాయలచెక్కులను మంత్రి పంపిణీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన తర్వాత విశ్వవ్యాప్తంగా ఈ పండుగను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు.

మన సంస్కృతిని చాటిచెప్పే బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం 15 కోట్ల రూపాయలను విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే 47 మంది లబ్ధిదారులకు 22 లక్షల రూపాయల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.

## విహారయాత్రలో విషాదం..ఛత్తీస్‌గఢ్‌లో ఆరుగురు జలసమాధి!

న్యూఢిల్లీ, ఆగస్టు 29: విహారయాత్రలో విషాదం నెలకొంది. జలపాతం అందాలను చూసి ఆనందించేందుకు వెళ్లిన వారు జలసమాధి అయ్యారు. వారాంతాన్ని ఎంజాయ్ చేసేందుకు చేపట్టిన యాత్ర ఆ కుటుంబానికి కన్నీళ్లనే మిగిల్చింది. ఛత్తీస్‌గఢ్‌లోని కొరియా జిల్లాలో జలపాతంలో మునిగి ఒకే కుటుంబానికి చెందిన మొత్తం ఆరుగురు మృతి చెందడం అందరినీ కలిచివేసింది.

వివరాల్లోకి వెళ్తే, మధ్యప్రదేశ్‌కు చెందిన 15 మంది కుటుంబ సభ్యులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌కు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామ్‌దహా జలపాతం వద్దకు ఆదివారం పిక్నిక్‌కు వెళ్లారు. జలపాతంలోని ప్లంజ్‌పూల్‌లో స్నానం చేస్తూ ఏడుగురు గల్లంతైనట్లు ఆదివారం అధికారులకు సమాచారం అందింది. మొదట ఏడుగురిలో ఇద్దరిని గుర్తించి, దవాఖానకు తరలించారు. వీరిలో ఒకరు దవాఖానలో మరణించారని, మరొకరు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని పోలీసు అధికారి తెలిపారు.

అనంతరం రెండు మృతదేహాలను పోలీసులు గుర్తించారు. చీకటి కావడంతో రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, పోలీసులు సెర్చ్ ఆపరేషన్‌ను ఆపేశారు. సోమవారం ఉదయం ఆపరేషన్ ప్రారంభించారు. తప్పిపోయిన మిగిలిన ముగ్గురు పర్యాటకుల మృతదేహాలను గుర్తించామని కొరియా కలెక్టర్ కుల్దీప్ శర్మ తెలిపారు. మృతులను శ్వేతా సింగ్ (22), శ్రద్ధా సింగ్ (14), అభయ్ సింగ్ (22)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, అనంతరం బంధువులకు అప్పగిస్తామని తెలిపారు. జలపాతంలో స్నానం చేయవద్దని ప్రజలను అభ్యర్థిస్తూ హెచ్చరిక బోర్డును ఉంచినప్పటికీ, పర్యాటకులు నీటిలోకి వెళ్లినట్లు పోలీసు అధికారి తెలిపారు.

### చరిత్రలో నేటినిజం



(ఆగస్టు 30 పారిశ్రామికవేత్త నావల్ టాటా జయంతి..)

-రాధశ్రీ

సెల్:9494481210



## అన్ని రంగాల్లో మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేస్తాం : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబాబాద్,ఆగస్టు 29: (నేటినిజం ప్రతినిధి): మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, 8 ఏండ్లలో ఎంతో మార్పు చెందిందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో నూతన ఆసరా పింఛన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ రూపురేఖలు మార్చాలన్న ఏకైక లక్ష్యంతోనే ముందుకెళ్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌లో అత్యంత వెనుకబడిన ప్రాంతాలుగా పేరొందిన టీడీగుట్ట, వీరన్నపేటలో గతంలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కాదని, ప్రస్తుతం వీరన్నపేటలో డబుల్‌బెడ్రూం ఇండ్లు కట్టించామని, టీడీగుట్ట వరకు బైపాస్ రహదారి నిర్మిస్తున్నామని తెలిపారు.

హన్వాడ వద్ద ఫుడ్ పార్క్ ఏర్పాటు చేసి పరిశ్రమలు నెలకొల్పుతున్నామన్నారు. త్వరలోనే పాతకలెక్టరేట్ స్థానంలో రూ.500 కోట్లతో సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటిగణేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు కోట్ల నర్సింహులు, మాధవీలత, మునీర్, నాయకులు శివరాజ్, చిన్న, శ్రీనివాస్,మార్కెట కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, అనంతయ్య,చిన్న, సత్యం యాదవ్, చెన్నయ్య లక్ష్మణ్‌నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## ఇలాంటి క్రిమినల్స్‌కు సమాజంలో స్థానం లేదు : కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 29: జార్ఖండ్‌లోని దమ్కాలో ఓ 12 ఏండ్ల బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పందించారు. బాలికను హత్య చేసిన అత్యంత క్రూరమైన క్రిమినల్ షారూఖ్‌కు ఈ సమాజంలో స్థానం లేదని కేటీఆర్ అన్నారు. ఆ క్రిమినల్‌లో ఎలాంటి పశ్చాత్తపం కనిపించడం లేదన్నారు. ఐపీసీ, క్రిమినల్ ప్రొసిజర్ కోడ్, జువైనల్ చట్టాలను మార్చాల్సిన అవసరం ఉందని.. ఇలాంటి నిందితులకు కఠినమైన శిక్షలను విధించాలన్నారు. నిందితులు బయటకు రాకుండా చూడాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బలమైన చట్టాలు అవసరం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## బీజేపీ అవినీతి గద్దలను గద్దె దించాలి : సీఎం కేసీఆర్



పెద్దపల్లి, ఆగస్టు 29: బీజేపీ అవినీతి గద్దలను గద్దె దించి.. వారి నుంచి ఈ దేశానికి విముక్తి పలుకాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. గుజరాత్ మోడల్ అని చెప్పి ఈ దేశాన్ని మోసం చేశారని కేసీఆర్ ధ్వజమెత్తారు. పెద్దపల్లి జిల్లాలో సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు.

పెద్దపల్లి జిల్లా అవుతుందని మనం కలలో కూడా అనుకోలేదు. తెలంగాణ ఏర్పడ్డది కాబట్టి పెద్దపల్లిని జిల్లా చేసుకున్నాం. అద్భుతమైన కలెక్టరేట్‌ను ఏర్పాటు చేసుకున్నాం. జిల్లా ప్రజాప్రతినిధులను, అధికార యంత్రాంగాన్ని, ప్రజలందరినీ హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. చాలా మంచి కార్యక్రమాలు చేసుకున్నాం. పేదలు, రైతులు, ప్రజలు, మహిళలు గురించి మంచి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు పోతున్నాం. భారతదేశమే ఆశ్చర్యపోయే విధంగా.. అద్భుతమైన పద్ధతిలో మనం ముందుకు వెళుతున్నామని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ ప్రాంతం గురించి మీకు తెలుసు. సింగరేణిలో వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు దొరకుతున్నాయి. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా సింగరేణి కార్మికులకు బోనస్ ఇస్తున్నాం. రామగుండం పట్టణాన్ని కార్పొరేషన్ చేసుకున్నాం. ఏ విధమైన కార్యక్రమాలు అమలవుతున్నాయో మీకు తెలుసు అని కేసీఆర్ తెలిపారు.

జాతీయ రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించారు..

నిన్న గాక మొన్న 26 రాష్ట్రాల నుంచి దాదాపు 100 మంది రైతు నాయకులు వచ్చారని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఇరిగేషన్ ప్రాజెక్టులను చూశాం. రైతులతో మాట్లాడం. ఈ రాష్ట్రంలో అమలవుతున్న కార్యక్రమాలు మా దగ్గర అమలు కావడం లేదు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించారు. జాతీయ రాజకీయాల్లోకి పోదామా? అని సభలో ఉన్న జనాలను కేసీఆర్ ప్రశ్నించారు.

గాంధీ పుట్టిన రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోంది..

గుజరాత్ మోడల్ అని చెప్పి దేశ ప్రజలను ఈ మోదీ దగా, మోసం చేశారని కేసీఆర్ ధ్వజమెత్తారు. అడ్డగోలుగా ధరలు పెంచారు. స్మశానాల మీద పన్ను, పాలమీద జీఎస్టీ, చేనేత మీద జీఎస్టీ, పేద ప్రజలు ఉసురుపోసుకుంటూ.. లక్షల రూపాయాలు మేస్తూ బీజేపీ అవినీతి గద్దలు దేశాన్ని మోసం చేస్తున్నాయి. కొన్ని సన్నివేశాలు స్వయంగా చూస్తున్నాం. గాంధీ పుట్టిన రాష్ట్రంలో మద్యపానం నిషేధం చేశామని చెప్తారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలో కల్తీ మద్యానికి 79 మంది బలయ్యారు. అక్కడ కల్తీ మద్యం ఏరులై పారుతోంది. దీని మీ సమాధానం ఏంటని అడుగుతున్నాను అని మోదీని ఉద్దేశించి కేసీఆర్ ప్రశ్నించారు.

తెలంగాణలో అమలవుతున్న పథకాలు గుజరాత్‌లో అమలు కావడం లేదు. అక్కడ దోపిడీ తప్ప మరొకటి లేదని సీఎం కేసీఆర్ ధ్వజమెత్తారు. పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. అక్కడ్నుంచి వచ్చేటటువంటి గులామ్‌లు, దోపిడీ దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆ దొంగల బూట్లు మోసే నన్నాసులు తెలంగాణలో కనబడుతున్నారు. వారి పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెడుదామా? దయచేసి ఆలోచించండి. 26 రాష్ట్రాల రైతులు తమకు చెప్పారు. మా వడ్లు కొనరు అని చెప్పారు. ఢిల్లీలోనే నేనే స్వయంగా ధర్నా చేశాను. ధాన్యం కొనేందుకు మోదీకి చేత కాదు. అంతర్జాతీయ మార్కెట్‌లో నూకలకు, గోధుమలకు షార్టేజ్ వస్తుంది. పరిపాలన చేతగాక దేశ ఆర్థిక స్థితిని దిగజారుస్తున్నారు. మోసపోతే గోస పడుతాం. ఒక్కసారి దెబ్బతింటే చాలా వెనక్కి పోతాం. కూలగొట్టడం చాల అలుక.. కట్టడమే చాలా కష్టమని కేసీఆర్ చెప్పారు.

ఇవాళ బాగు పడే సమయంలో గజదొంగలు. లంచగొండులు వచ్చి ప్రజాధనాన్ని దోచుకుంటూ, మతం పేరు మీద కొట్లాడమని చెప్తున్నారు. నెత్తురు పారించమని చెప్పే పిశాచులు ప్రజలు మధ్య ద్వేషాలు రెచ్చగొడుతున్నారు. దొంగల బారిన పడితే చాలా ప్రమాదం వస్తుంది. నేను చెప్పే మాట్లో సత్యం వుంది. కనుక చినుకులు పడుతున్నాయని కేసీఆర్ పేర్కొన్నారు.చెప్పులు మోసే వెధవలు కారు కూతలు కూస్తూ సామాజాన్ని కలుషితం చేస్తున్నారు. మేధావులకు, కళాకారులకు దండం పెట్టి చెప్తున్నాం. పెద్దపల్లి చైతన్యం ఉన్న గడ్డ. సింగరేణి కార్మిక లోకం కన్నెర్ర చేసి పిడికిలి ఎత్తాలి. అందరం కలిసి 2024లో బీజేపీ ముక్త్ భారత్ సృష్టించాలి. అందుకు సన్నద్ధపడాలి. ముందుకు కదలాలి. అప్పుడే ఈ దేశాన్ని కాపాడగలుగుతాం. నిద్రాణమై ఉండకుండా మేల్కొని ప్రజలను చైతన్యం చేసి బీజేపీ, మతపిచ్చిగాళ్లు, ఉన్మాదుల నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు అందరం కలిసి ముందుకు పోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

## వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని 3 ఏళ్ల బిడ్డను చంపిన తల్లి

హైదరాబాద్, ఆగస్టు 29: తల్లి అనే పేరుకు మచ్చ తెచ్చింది ఓ మహిళ. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని తన మూడేళ్ల కొడుకుని కడతేర్చింది. ఈ ఘటన హైదరాబాద్ లోని ముషీరాబాద్ లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పార్శిగుట్టలో నివసాముంటున్న ఓ మహిళ.. నెల రోజుల క్రితం కుర్చీమీద నుంచి కిందపడి తన కుమారుడు చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముషీరాబాద్ పోలీసులుకేసు నమోదు చేశారు. అయితే తల్లి ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తమ విచారణలో వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి తల్లే హత్య చేయించినట్లు తేలింది. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## టీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

హైదరాబాద్, ఆగస్టు 29: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి నగరం నలుమూలల నుంచి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. రెండు మూడు రోజులుగా వందలాదిగా కాషాయ పార్టీ కార్యకర్తలు గులాబీ దళంలోకి వచ్చి చేరుతున్నారు. బీజేపీ రాజకీయాలపై విసుగు చెందిన నేతలు, కార్యకర్తలు ఆదివారం జూబ్లీహిల్స్, మియాపూర్, కూకట్‌పల్లి, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలో భారీగా వచ్చి టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు.

దేశంలో బీజేపీ వాళ్ళే దేశ భక్తులుగా భావించుకుంటున్నారని.. కుల మతాల మధ్య చిచ్చులు పెట్టి పబ్బం గడుపుకుంటున్నారని టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ విమర్శించారు. ఆదివారం రహ్మత్ నగర్ డివిజన్ హెచ్‌ఎఫ్‌నగర్-2లో టీఆర్ఎస్‌లో చేరిన 300 మంది బస్తీవాసులకు కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి పార్టీ కండువాలు కప్పి టీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశం లో ఎమ్మెల్యే గోపీనాథ్ మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, అందుకే అన్ని ప్రాంతాల నుంచి టీఆర్ఎస్ పార్టీలో వచ్చి చేరుతున్నారని చెప్పారు.

పేద ప్రజల కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలను ఆదుకునే విధంగా ఆయా పథకాలు రూపకల్పన చేశారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. హబీబ్ ఫాతిమా నగర్ నుంచి కార్పొరేటర్ సీఎన్ రెడ్డి నాయకత్వంలో హెచ్‌ఎఫ్ నగర్ ఫేస్-2 ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ గని ఆధ్వర్యంలో మైనార్టీలు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో తన్నూఖాన్, అప్పూఖాన్, డివిజన్ అధ్యక్షుడు మన్సూర్, మహ్మద్ మొయిజ్, సయ్యద్ సికిందర్, ఎస్‌డి జాఫర్, ఎండీ షరీఫ్, ఎస్‌డి ఖాజా, మసీద్ సదర్, ఫజల్, ఎస్డీ ఫరూఖ్, సయ్యద్ రఫీ, ఎండీ జాఫర్, ప్రధాన కార్యదర్శులు సుబ్బరాజు, శ్రీనివాస్, నాగరాజు, గన్ని, జబ్బార్, చోటు, ఫయాజ్, గఫూర్, అలీమ్‌లతో పాటు పార్టీలో చేరిన వారు పాల్గొన్నారు.

## రేపు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

హైదరాబాద్, ఆగస్టు 29: : ఈ నెల 30వ తేదీన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల కానున్నాయి. ఆగస్టు 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఫలితాల కోసం ష్ట్రబిబిజూబ://బిబఎతివ.ఇ‌ణణ.ణనీల.తిని/ వెబ్‌సైట్‌ను లాగిన్ అవొచ్చు.

ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో ఫస్టియర్‌లో 63.32 శాతం.. సెకండియర్‌లో 67.16 శాతం ఉత్తీర్ణత నమోదైన సంగతి తెలిసిందే. మొత్తం 9,28,262 మంది పరీక్షలు రాయగా.. ఫస్టియర్‌లో 2,94,378 మంది, సెకండియర్‌లో 4,63,370 మంది ఉత్తీర్ణత సాధించారు.

## నాసా మూన్ మిషన్ 'ఆర్టెమిస్ 1' లాంచ్ వాయిదా? హైడ్రోజన్ లీకేజీతో కౌంట్‌డౌన్ నిలిపివేత

వాషింగ్టన్, ఆగస్టు 29: అమెరికా అంతరిక్ష సంస్థ నాసా చేపట్టిన మరో ప్రతిష్ఠాత్మక మూన్ మిషన్ వాయిదా పడింది. పవర్‌ఫుల్ రాకెట్ ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. హైడ్రోజన్ లీకేజీ కారణంగా సోమవారం నాటి 'ఆర్టెమిస్ 1' లాంచ్ కౌంట్‌డౌన్‌ను మధ్యలో నిలిపివేశారు. ౦-40 నిమిషాల వద్ద కౌంట్‌డౌన్ నిలిపివేసినట్లు నాసా తెలిపింది. ఆర్టెమిస్ 1 లాంచ్ డెరెక్టర్‌తో మిషన్ ప్రణాళికలను హైడ్రోజన్ బృందం చర్చిస్తున్నట్లు ట్వీట్ చేసింది.

1972 డిసెంబర్ 7న ప్రయోగించిన అపోలో 17 మిషన్‌తో మానవుడు చంద్రుడిపై కాలుమోపి 50 ఏళ్లైంది. ఈ నేపథ్యంలో మరో ప్రతిష్ఠాత్మక మూన్ మిషన్‌కు నాసా శ్రీకారం చుట్టింది. చంద్రుడిపైకి మానవులను పంపించాలన్న లక్ష్యంతో ఆర్టెమిస్ ప్రాజెక్టును చేపట్టింది. దీని కోసం అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన, 98 మీటర్ల పొడవైన స్పేస్ లాంచ్ సిస్టమ్(ఎస్ఎల్ఎస్) రాకెట్‌ను తొలిసారి నాసా ప్రయోగించనున్నది. దీని ద్వారా ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను నింగిలోకి పంపనున్నది.

కాగా, ఆర్టెమిస్-1 ప్రయోగం ద్వారా ఓరియన్ క్యాప్సూల్స్ పనితనాన్ని నాసా పరిశీలిస్తుంది. భవిష్యత్ ప్రయోగాల్లో వ్యోమగాములను మోసుకెళ్లే ఓరియన్ క్యాప్సూల్ భూమి మీదకు రీ ఎంట్రీ, రికవరీని టెస్ట్ చేయనున్నది. అయితే ఫ్లోరిడాలోని ఆధునీకరించిన కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి సోమవారం తలపెట్టిన ఈ ప్రయోగం సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది.

## తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడే అవకాశం: వాతావరణ శాఖ

హైదరాబాద్, ఆగస్టు 29: తెలంగాణ మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. తుంగభద్ర నది నుంచి కృష్ణా నదిలోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. కృష్ణా పరివాహక ప్రాంతంలో వరదలు వస్తున్నాయి. జూరాల నుంచి శ్రీశైలానికి భారీగా వరద వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు.




# స్మార్ట్ చదువులకు క్రీడలు తోడు కావాలి

మన దేశ క్రీడా జెండాను విశ్వ ఒలంపిక్ క్రీడా వేదికగా మూడు సార్లు (1928, 1932, 1936) ఎగురవేసిన బుందేల్‌ఖండ్ ఆణిముత్యం అత్యుత్తమ హాకీ క్రీడాకారుడు పద్మభూషనుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు 29 ఆగష్టు 1905ను భరతావని నలుమూలల "జాతీయ క్రీడా దినం"గా ప్రతియేట పాటించుట ఆనవాయితీగా మారింది. భారత వీర సైనికుడు ధ్యాన్‌చంద్ క్రీడా జీవితంలో (1926–48 మధ్య కాలంలో) 1000కి పైగా హాకీ బంతితో గోల్స్‌ను ముద్దాడిన ఘనుడిగా ప్రతి ఒక్క భారతీయుడి మదిలో తిష్ట వేశారు. కోట్లాది భారత యువతను క్రీడల వైపుకు ఆకర్షించాలనే లక్ష్యంతో 1991–92లో నెలకొల్పిన దేశ అత్యుత్తమ క్రీడా పురస్కారం 'రాజీవ్‌గాంధీ ఖేల్ రత్న' అవార్డును 2021 నుంచి 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న'గా పునర్ నామకరణం చేయడం ముదావహం. క్రీడా కారులకు ఇవ్వనున్న అవార్డులను ప్రముఖ క్రీడాకారుల పేరున ఇవ్వడం సముచితంగా తోస్తున్నది. 2016 నుంచి దేశ అత్యుత్తమ క్రీడాకారుడికి ప్రదానంచేసే పురస్కారం కూడా "ధ్యాన్‌చంద్ జీవన సాఫల్య అవార్డు"గా అందించడం మనకు తెలుసు.

క్రీడల ప్రయోజనాలు :

**(29 ఆగష్టు "జాతీయ క్రీడా దినం" సందర్భంగా)**

క్రీడలతో వ్యక్తిగతంగా శారీరక, మానసిక ఆరోగ్యం, యువతలో జీవన నైపుణ్యాలు, జీవన ఎత్తుపల్లాల నియంత్రణ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్, శారీరక చురుకుదనం, ఒత్తిడి నిర్వహణ, ఆత్మవిశ్వాసాలను పెంచుటలో ఆటలు దోహదపడతాయి. గెలుపోటములను సమానంగా స్వీకరించడం క్రీడా స్ఫూర్తి నేర్పుతుంది. క్రీడలతో ఎముకల పటిష్టత, గుండె సంబంధ ఆరోగ్యం, స్థూలకాయాన్ని దూరం చేయడం, ప్రశాంత నిద్ర, శారీరక అవయవాల సమన్వయం, సమాజంలో గుర్తింపుతో పాటు ఆదర్శంగా నిలవడం, ఊపిరితిత్తుల ఆరోగ్యం, బిపి/షుగర్ నియంత్రణ, నిర్ణయం తీసుకునే నైపుణ్యం, రోగనిరోధక శక్తి పెరుగుదల, ఉద్యోగ సాధన లాంటి ముఖ్య ప్రయోజనాలు ఉన్నాయి.

దేశ క్రీడా కాగడాను విశ్వవ్యాప్తం చేసిన "ఖేల్ రత్నా"లు:

భారతదేశ అత్యుత్తమ చదరంగ ఆటగాడు, బాల మేధావి గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్‌కు తొలి "ఖేల్ రత్న" పురస్కారాన్ని 1991–92లో ప్రదానం చేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ అత్యుత్తమ పురస్కారాన్ని పొందిన క్రీడా దిగ్గజాల జాబితాలో పంకజ్ అదానీ (బిలియర్డ్స్ అండ్ స్నూకర్), రోహిత్ శర్మ (క్రికెట్), మరియప్ప (పారా అథ్లెటిక్స్), మనిక బాత్రా (టేబుల్ టెన్నిస్), వినేష్ పోగట్ (రెజ్లింగ్), గీతా సేతి (బిలియర్డ్స్), కరణం మల్లేశ్వరీ (వేయిట్ లిఫ్టింగ్), లియాండర్ పేస్ (టెన్నిస్), సచిన్ టెండూల్కర్ (క్రికెట్), ధన్‌రాజ్ పిల్లై (హాకీ), పుల్లెల గోపీచంద్ (బ్యాడ్‌మింటన్), అభినవ్ బింద్రా (షూటింగ్), అంజు బాబీ జార్జ్ (అథ్లెటిక్స్), రాజవర్ధన్ సింగ్ రాథోడ్ (షూటింగ్), మహేంద్ర సింగ్ ధోనీ (క్రికెట్), మేరీ కోమ్ (బాక్సింగ్), విజెందర్ సింగ్ (బాక్సింగ్), సుశీల్ కుమార్ (రెజ్లింగ్), సైనా నెహవాల్ (బ్యాడ్మింటన్), గగన్ నరంగ్ (షూటింగ్), సానియా మిర్జా (టెన్నిస్), పి వి సింధూ (షటిల్), సాక్షి మాలిక్ (రెజ్లింగ్), విరాట్ కొహ్లీ (క్రికెట్), రాణి రాంపాల్ (హాకీ), బజరంగ్ పునియా (రెజ్లింగ్), దీపా మలిక్ (పారాలంపిక్స్), మీరాభాయ్ చానూ (వేయిట్ లిఫ్టింగ్), సర్దార్ సింగ్ (హాకీ), దేవేంద్ర జజరియా (పారాలింపిక్స్), జీతూ రాయ్ (షూటింగ్), దీపా కర్మాకర్ (జిమ్నాస్టిక్స్), రోజన్ సోధీ (షూటింగ్), యోగేశ్వర్ దత్ (రెజ్లింగ్), విజయ్ కుమార్ (షూటర్), యం యస్ సంధూ (షూటింగ్), అంజలి భగత్ (షూటింగ్), బినామొల్ (అథ్లెటిక్స్), జ్యోతిర్మయి (అథ్లెటిక్స్), కుంజారాణి (వేయిట్ లిఫ్టింగ్), పుష్పేంద్ర కుమార్ (యాచింగ్), హోమి మోతివాలా (యాచింగ్), రవి కుమార్ (రెజ్లింగ్), మిథాలిరాజ్ (క్రికెట్), లవ్‌లీనా (బాక్సింగ్), శ్రీజేష్ (హాకీ) లాంటి పలు క్రీడాకారులకు చోటు దక్కించుకోవడం హర్షదాయకం. ఈ పురస్కారంలో భాగంగా పతకం, సర్టిఫికెట్, 25 లక్షల నగదు అందించి సన్మానిస్తారు. ఖేల్ రత్నకు తోడుగా అర్జున అవార్డు, ద్రోణాచార్య అవార్డులు కూడా ప్రదానం చేయడం మనకు విదితమే.

ఆధునిక బాలలు/తల్లితండ్రులు ర్యాంకుల, మార్కుల వేటలో కొట్టుకుపోతున్నారు. నేటి స్మార్ట్ చదువులకు తోడుగా క్రీడలు కూడా తోడైతేనే పిల్లల సమగ్రాభివృద్ధి సుసాధ్యం అవుతుందని తల్లితండ్రులు, విద్యార్థులు తెలుసుకోవాలి. మన విద్యలో క్రీడలు ప్రధాన భాగం కావాలి. ఆటలు పిల్లల ముఖాల్లో సంతోష పువ్వులు పూయించాలి. క్రీడా ప్రాంగణం చెమటతో తడిసి ముద్ద కావాలి. యువతలో నిస్సత్తువ తరిమి వేవాలి. క్రీడాకారుడిగా పతకాల పంట పండించాలి. జాతీయ పతాక రెపరెపలను విశ్వవ్యాప్తం చేయాలి. నిర్వీర్య యువతలో క్రియాశీలతను జోడించుటకు ఆటపాటలు ఉపకరణాలుగా మారాలి. ఆటలు కూడా ఉద్యోగాలను పొందడానికి మార్గమని తెలుసుకోవాలి. నేటి యువభారతం క్రీడా నైపుణ్య జ్ఞానంతో ధ్యాన్‌చంద్ వారసుడిగా దేశ క్రీడా ప్రతిష్టను ఇనుమడింపజేయాలి. క్రీడలు కీర్తి తోరణాలు, ఆటలు అమూల్య ఆరోగ్య ప్రదాతలని రుజువు చేయాలి.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు.. మంత్రి జయరాం



అమరావతి, ఆగష్టు 27: పార్టీలకు, కుల మతాలకు అతీతంగా తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు.

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం పెద్దహోత్తూర్ గ్రామంలో గడపగడపకు మన కార్యక్రమాన్ని సర్పంచ్ లక్ష్మన్న ఆధ్వర్యంలో మంత్రి గుమ్మనూరు జయరాం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందజేయడమే తమ లక్ష్యమన్నారు. గత మూడు సంవత్సరాలు గ్రామానికి 21 కోట్ల 65 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు.

ప్రతి గ్రామానికి సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రతి ఒక్కరికీ, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి శాయాశక్తులా తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి

అమరావతి, ఆగష్టు 29: విశాఖపట్టణంలోని అగనంపూడి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగివున్న లారీని బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై లారీ టైర్ మార్చుతుండగా వేగంగా వచ్చి బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైసీపీలో చేరిన గంజి చిరంజీవి

అమరావతి, ఆగష్టు 29: ఇటీవలే టీడీపీకి రాజీనామా చేసిన గంజి చిరంజీవి వైసీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఈరోజు ఆయన వైసీపీ కండువా కప్పుకున్నారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభివృద్ధికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశేష కృషి చేస్తోందని తెలిపారు. సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయన్నారు. బీసీల పార్టీ అని చెప్పుకునే టనిరంతరం అవమానాలకు గురిచేస్తూ బీసీలను ఏమి ఉద్ధరిస్తారని ఆ పార్టీ నాయకుల్ని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సహా ఏ ఒక్క సామాజికవర్గానికి టీడీపీలో గౌరవం లేదని విమర్శించారు.

టీడీపీలో పెత్తనమంతా ఒకే సామాజిక వర్గానిదేనని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు.

ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్‌కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.



# జమ్మూలో సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ మీడియా యూనిట్ల సమీక్ష సమావేశం నిర్వహించిన డాక్టర్. ఎల్.మురుగన్

న్యూఢిల్లీ, ఆగష్టు 27: సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ మీడియా యూనిట్ల సమీక్ష సమావేశాన్ని ఈ రోజు జమ్మూలో కేంద్ర సమాచార ప్రసార, మత్స్య, పాడి పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్. ఎల్.మురుగన్ నిర్వహించారు. గ్రామీణ ప్రజలను చేరుకోవడానికి రేడియో అత్యుత్తమ ప్రసార సాధనం గా ఉంటుందని డాక్టర్ మురుగన్ అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రసారం చేయడమే కాకుండా ఆకాశవాణి, దూరదర్శన్ ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

ఖాదీ వినియోగం ఎక్కువ చేయడానికి, ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్ వాడకం తగ్గించడానికి ఉపకరించే కార్యక్రమాలను ప్రసారం చేయాలని సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ మీడియా యూనిట్లకు ఆదేశాలు జారీ చేశారు. జమ్మూ కాశ్మీర్ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, జమ్మూ కాశ్మీర్, లడఖ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ విభాగాలు, వాటి ఫీల్డ్ యూనిట్లతో కలిసి నిర్వహిస్తున్న మీడియా కార్యక్రమాలు, ప్రచార కార్యక్రమాలపై జమ్మూ కాశ్మీర్ ప్రాంతీయ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీ రాజిందర్ చౌదరి పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా వివరించారు.

సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ప్రసారం అయిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని డాక్టర్ మురుగన్ విన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమానికి సామాజిక మాధ్యమాలు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా మరింత ప్రచారం కల్పించాలని మీడియా యూనిట్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. జమ్మూ ఆకాశవాణి/దూరదర్శన్ క్లస్టర్ హెడ్ శ్రీ.రాజేష్ కుమార్, జమ్మూ దూరదర్శన్ డైరెక్టర్ శ్రీ.రవి కుమార్, జమ్మూ కాశ్మీర్, లడఖ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సంయుక్త డైరెక్టర్ శ్రీ.గులాం అబ్బాస్, పబ్లికేషన్ విభాగం జాయింట్ డైరెక్టర్ కుమారి నేహా జలాలి, జమ్మూ ఆకాశవాణి/దూరదర్శన్ న్యూస్ హెడ్ శ్రీ రమేష్ కుమార్ మీడియా యూనిట్లకు చెందిన అధికారులు, సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు.

జమ్మూలో ఉన్న బాగ్–ఈ బహు అక్వేరియం ను డాక్టర్ మురుగన్ ఈ రోజు సందర్శించారు. మూడు రోజుల జమ్మూ పర్యటనలో ఉన్న డాక్టర్ మురుగన్ శ్రీ మాతా వైష్ణో దేవి, బావె వాలి మాత లను దర్శించి పూజలు చేశారు. నిన్న రియాసీ లో చేపల చెరువును దర్శించిన మంత్రి రైతులకు చేప విత్తనాలు అందించారు. లంపి స్కిన్ నిరోధానికి ఇస్తున్న టీకా కార్యక్రమాన్ని మంత్రి రియాసీ జ్యోతి పురం గోశాలలో ప్రారంభించారు.

# కవులు, రచయితలు తెలంగాణకు రెండు కళ్లు..

## –సాహితీ మాణిక్యం పురస్కార సభలో మంత్రి పువ్వాడ



హైదరాబాద్, ఆగష్టు 27: కవులు, రచయితలు తెలంగాణకు రెండు కళ్ల వంటి వారని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సాహితీ మాణిక్యం పురస్కార ప్రధాన సభలో మంత్రి నిరంజన్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలువురు కవులు, రచయితలకు పురస్కారాలను ప్రదానం చేశారు. కవులు బంగారు తెలంగాణ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నారని ప్రతి సంవత్సరం తెలుగుమహాసభల పేరుతో కవులకు అరుదైన గౌరవాన్ని ఇస్తున్నారని మంత్రి పువ్వాడ గుర్తు చేశారు. తెలంగాణలో కవులకు మంచి ప్రాధాన్యం ఉందన్నారు. కవుల్లో ఉన్న ఉత్తేజం, ఉత్సాహం చూస్తే చాలా ఆనందం కలుగుతుందని అన్నారు.

తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కవి, విమర్శకులు, కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్॥ సీతారాం ప్రతి సంవత్సరం తన మాతృమూర్తి పేరిట సాహితీ మాణిక్యం పురస్కారాలు అందజేస్తున్నారు. కాగా, 2020–21 సంవత్సరానికి ఎంపికైన కవులు, కవయిత్రులలో ఆకెళ్ల రవి ప్రకాష్, షాజహానా, జూపాక సుభద్ర, వనపట్ల సుబ్బయ్యకు పురస్కారాలను ప్రదానం చేశారు.

# టూరిజం హబ్‌గా తెలంగాణ.. మరింతగా పర్యాటక ప్రదేశాల అభివృద్ధి : ఉప్పల శ్రీనివాస్ గుప్తా



హైదరాబాద్, ఆగష్టు 27: కేసీఆర్ సీఎం అయిన తర్వాత పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఇవ్వాల (ఆదివారం) హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని హోటల్ దస్‌పల్లాలో అంతర్జాతీయ ట్రావెల్ అండ్ టూరిజం అసోసియేషన్ ఆధ్వర్యంలో నెట్ వర్కింగ్ మీట్ జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలు తెలంగాణలో పర్యాటక రంగాన్ని పట్టించుకోలేదన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన పర్యాటక ప్రదేశాలను డెవలప్ చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఎకో టూరిజం, హెల్త్ టూరిజం, బిజినెస్ టూరిజం, టెంపుల్ టూరిజం వంటి వాటిని ఇంట్రడ్యూస్ చేస్తున్నట్టు చెప్పారు. వీటన్నిటిని ప్రోత్సాహిస్తూ తెలంగాణ పర్యాటక ప్రదేశాలను ఒక హబ్ లాగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి దేవాలయాన్ని 1500 కోట్ల రూపాయలతో అద్భుతంగా నిర్మించి ప్రారంభించుకున్నామని, అదేవిధంగా చారిత్రక నేపథ్యమున్న రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడానికి ఎంతో కృషిచేశారన్నారు. ఇక.. నాగార్జున సాగర్ లో నూతనంగా బుద్ధవనంని కూడా ఏర్పాటు చేయడం జరిగింది ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఈ కార్యక్రమంలో అమెరికా కాన్సులేట్ జనరల్ ఆండ్రు ఏడెల్ఫ్ సన్, ఎన్ ఎస్ ఎన్ మోహన్, రవి చంద్రన్, వాల్మీకి, ప్రవీణ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# కరీంనగర్ టు పెద్దపల్లి



కరీంనగర్ , ఆగష్టు 29: ముఖ్యమంత్రి కేసీఆర్ సభలో పాల్గొనేందుకు కరీంనగర్ నుండి నాయకులు, కార్యకర్తలు భారీగా వాహనాల్లో తరలి వెళ్లారు. కరీంనగర్ ఉజ్వల పార్క్ బై పాస్ నుండి మధ్యాన్నం 1 గంటకు భారీగా వాహనాలు వరుస క్రమంలో బయలు దేరాయి. మంత్రి గంగుల కమలాకర్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి గంగుల, మేయర్ సునీల్ రావు, ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, టి ఆర్ ఎస్ నాయకులు హరి శంకర్ లు బస్ టాపుపై ఎక్కి ర్యాలీని ముందుకు నడిపించారు.

# ఆక్వా రైతులకు శుభవార్త.. సెప్టెంబరు 1 నుంచి విద్యుత్ రాయితీ

అమరావతి, ఆగష్టు 29: రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి అనేక ప్రోత్సాహకాలు, రాయితీలు అందజేసింది. ఈ నేపథ్యంలోనే సెప్టెంబరు ఒకటి నుంచి ఆక్వా రైతులకు మరో తీపి కబురు అందించనుంది పదెకరాల లోపు ఆక్వా జోన్ పరిధిలో పదెకరాల్లోపు సాగుచేసే సన్న, చిన్నకారు ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని వర్తింపజేయనుంది. ఈ సందర్భంగా లబ్ధదారుల గుర్తింపుకు చేపట్టిన సర్వే ఈ నెలాఖరుతో ముగియనుంది. అర్హతగల వారికి సెప్టెంబర్ 1 నుంచి విద్యుత్ రాయితీని వర్తింపజేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

రాష్ట్రంలో 1.40 లక్షల ఎకరాల్లో ఉప్పునీటి, 3.89లక్షల ఎకరాల్లో మంచినీటి ఆక్వా సాగు జరుగుతోంది. వీటికి 63,343 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ–క్రాప్ బుకింగ్ ప్రకారం 1,35,842 మంది ఆక్వా రైతులుండగా, 2.5 ఎకరాల లోపు 95,277 మంది, 2.5 నుంచి ఐదెకరాల్లోపు 22,358 మంది, 5–10 ఎకరాల్లోపు 11,809 మంది, పదెకరాలకు పైబడి 6,398 మంది ఉన్నారు. కానీ, నాన్ ఆక్వాజోన్ పరిధిలో సాగుచేస్తున్న వారు సైతం విద్యుత్ రాయితీ ద్వారా లబ్ధిపొందుతున్నారు. అలాగే, కొన్నిచోట్ల కనెక్షన్ ఒకరి పేరిట ఉంటే, సాగు మరొకరు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తొలుత జోన్ పరిధిలో ఐదెకరాల్లోపు సన్న, చిన్నకారు ఆక్వా రైతులకు మాత్రమే విద్యుత్ రాయితీ వర్తింపజేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ తర్వాత ఆ పరిమితిని పదెకరాలకు పెంచింది. అనంతరం ఆక్వాజోన్ పరిధిలో వాస్తవంగా సాగుచేసే పదెకరాల్లోపు రైతులను గుర్తించేందుకు విద్యుత్, రెవెన్యూ, మత్స్య శాఖలతో సర్వే చేపట్టింది. విద్యుత్ కనెక్షన్ ఎవరి పేరిట ఉంది? ఆ కనెక్షన్ పరిధిలో ఎంత విస్తీర్ణం ఉంది? ప్రతీనెలా ఎంత విద్యుత్ వినియోగమవుతోంది? ఆ చెరువుకు లైసెన్సు ఉందా.. లేదా? వంటి వివరాలను ఈ సర్వేలో సేకరించారు.

**జోన్‌ల వారీగా డిస్కంలకు జాబితాలు..**

మే నెలలో చేపట్టిన ఈ సర్వే ఆగస్టు నెలాఖరులోగా పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ తర్వాత జోన్, నాన్‌జోన్ పరిధిలో ఎంత విస్తీర్ణం ఉంది? వాటి పరిధిలో ఎన్ని విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.. జోన్ వారీగా ఎంతమంది ఆక్వా రైతులు ఉన్నారో గుర్తించి ఆ జాబితాలను ఆయా డిస్కంలకు పంపిస్తారు. ప్రభుత్వాదేశాల మేరకు జోన్ పరిధిలోకి వచ్చే పదెకరాల్లోపు ఆక్వా రైతులకు సెప్టెంబర్ 1 నుంచి విద్యుత్ రాయితీని వర్తింపజేసేలా ఏర్పాట్లు–చేస్తున్నారు. విద్యుత్ రాయితీ పొందాలంటే జోన్ పరిధిలో అర్హతగల ఆక్వా రైతులు తాము సాగుచేస్తున్న భూముల భూరికార్డు, వన్ బీ అడంగల్, లీజ్ అగ్రిమెంట్ కాపీ, వీఆర్వో నుంచి పొందిన సర్టిఫికెట్ ఆఫ్ కల్చర్‌లతో ఆర్బీకేల్లోని మత్స్య సహాయకులు లేదా మత్స్య అభివృద్ధి అధికారిని సంప్రదించాలి. వివరాలను నమోదు చేయించుకుని విద్యుత్ రాయితీకి అర్హత పొందాలి.

# దేశవ్యాప్తంగా అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్ (ఐడిపిపి)ని జారీ చేయడం కోసం నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ, ఆగష్టు 29: దేశవ్యాప్తంగా పౌరులకు అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్ (ఐడిపి) జారీని మరింత సులభతరం చేయడం కోసం 26 ఆగస్టు 2022న రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

భారతదేశం 1949 జెనీవా కన్వెన్షన్లో భాగంగా అంతర్జాతీయ రహదారి ట్రాఫిక్ ఒడంబడికి పై సంతకం చేయడంతో ఐడిపిని జారీ చేసే సమయంలో ఇతర దేశాలతో పరస్పర ఆమోద ప్రాతిపదికన ఈ కన్వెన్షన్ కింద ఐడిపిని జారీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం భారత్‌లోని వివిధ రాష్ట్రాలలో జారీ చేస్తున్న ఐడిపిల ఆకృతి, పరిమాణం, నమూనా, రంగు తదితరాలు భిన్నంగా ఉంటున్నాయి. దీనివల్ల, విదేశాలలో తమ ఐడిపిలకు సంబంధించి పలు సమస్యలను అనేకమంది పౌరులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు, ఈ సవరణ ద్వారా భారత దేశ వ్యాప్తంగా జారీ చేసేందుకు ఐడిపికి నిర్దిష్ట రూపం, సైజు, రంగు తదిరాలను ప్రమాణీకరించడం జరిగింది. ఇది జెనీవా ఒడంబడికకు కట్టుబడి ఉంటుంది. ఐడిపిని డ్రైవింగ్ లైసెన్సుతో అనుసంధానం చేసేందుకు క్యూఆర్ కోడ్ లింక్ సౌకర్యం కల్పించారు.

# సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి



తిరుపతి , ఆగష్టు 29: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని, ఇందుకోసం ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షల నిధులు కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. ఈరోజు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా చేరుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏ మేరకు ప్రయోజనం చేకూరుతుందో తెలియజేసే రిపోర్ట్ తో కూడిన బుక్ లెట్ ను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేయడంలో గత ప్రభుత్వాలకు ప్రస్తుత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో చేసిన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని అర్హులందరికీ ప్రయోజనం చేకూర్చేలా నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాలన ప్రజల ముంగిటకు తీసుకురావాలనే ఉద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. కుల మత పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, సంధ్య, టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు బ్రహ్మానంద రెడ్డి, మబ్బు నాద ముని రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట ముని రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

# నల్లగొండ జిల్లాలో క్రీ.శ. 13వ శతాబ్దం నాటి అతి చిన్న గణేశ శిల్పం లభ్యం

హైదరాబాద్, ఆగష్టు 29: నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం పరడ గ్రామ పరిసరాల్లో కాకతీయుల కాలం నాటి అతి చిన్న గణేశ విగ్రహాన్ని గుర్తించినట్లు పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, చరిత్ర పరిశోధకుడు రాగి మురళి తెలిపారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఇచ్చిన సమాచారం మేరకు పరడగుట్ట మీద గల కొత్త రాతియుగం, ఇనుపయుగపు ఆనవాళ్లు, కొండ దిగువ తూర్పు వైపున గల బౌద్ధస్థూప శిథిలాలను పరిశీలిస్తుండగా, 4.0 సెం.మీ. ఎత్తు, 3.0 సెం.మీ. వెడల్పు, 2.0 సెం.మీ.ల మందంతో గల చిన్న గణేశ శిల్పాన్ని గుర్తించామని వారు చెప్పారు. తలపైన కాకతీయశైలి జటామకుటం, ఏనుగుతల, వెడల్పాటి చెవులు, ఎడమవైపుకు తిరిగిన తొండం, రెండు చేతుల్లో దంతం, మోదకం, పెద్ద బొజ్జపైన నాగయజ్ఞపవీతం, లలితాసనంలో కూర్చొని ఉన్న గణేశుని పీఠంపైన చిన్న మూషిక (ఎలుక) వాహనం, చక్కటి ప్రతిమా లక్షణంతో ఉందని, క్రీ.శ.13వ శతాబ్దికి చెందిన ఈ శిల్పం, మెత్తటి రాతిలో చెక్కబడిరదని శివనాగిరెడ్డి తెలిపారు.

గతంలో కర్నూలు జిల్లా వీరాపురంలో క్రీ.శ.3వ శతాబ్దానికి చెందిన ఇదే పరిమాణంలో ఉన్న మట్టి గణేశుని బొమ్మ, రంగారెడ్డి జిల్లా కీసరగుట్టలో క్రీ.శ.5వ శతాబ్దానికి చెందిన గణేశుని రాతి శిల్పం బయటపడ్డాయని, కాకతీయుల కాలంనాటి ఇంత చిన్న గణేశుని బొమ్మ తెలంగాణాలో బయల్పడటం ఇదే తొలిసారని ఆయన అన్నారు. పరడ గుట్టకు తూర్పువైపున శాతవాహన, ఇక్ష్వాకుల కాలం నాటి పురాతన స్థలంలో మరిన్ని పరిశోధనలు జరిగితే, అనేక చారిత్రక అవశేషాలు బయల్పడే అవకాశముందని శివనాగిరెడ్డి, మురళి తెలియజేశారు.

# పర్యావరణహిత విగ్రహాలనే పూజించండి : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, ఆగష్టు 29: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటు పడాలని, పర్యావరణహిత గణపయ్యలనే పూజిద్దామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకొని క్లిమోమ్ ఆధ్వర్యంలో తయారు చేసిన గోమయ వినాయక ప్రతిమలను సోమవారం శాస్త్రినగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్లిమోమ్ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడా గణేష్ ఉత్సవాల సందర్భంగా ఉచితంగా గోమయ వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తుందన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో వీటిని అందజేస్తున్నామని తెలిపారు.

గోమయం, మట్టితో తయారు చేసిన విగ్రహాలతో ఎలాంటి హాని ఉండదని, కాలుష్యం లేని పర్యావరణ హితం కోరే ఏకో ఫ్రెండ్లీ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంధ్రత్ ఈశ్వర్, టీఆర్ఎస్ పట్టణ టీఆర్ఎస్ అధ్యక్షుడు మారుగొండ రాము, అల్లోల మరళీధర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, క్లిమోమ్ వ్యవస్థాపకురాలు దివ్యారెడ్డి, గౌతం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# ప్రధానమంత్రి జన్-ధన్ యోజన (పిఎంజెడివై) - ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కోసం చేపట్టిన జాతీయ కార్యక్రమం అమలులోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు పూర్తి.

న్యూఢిల్లీ, ఆగష్టు 29: ఆర్థిక మంత్రిత్వ శాఖ చేపడుతున్న ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కార్యక్రమాల ద్వారా సామాజికంగా నిరాదరణకు గురైన, ఇన్నేళ్లుగా సామాజికంగా, ఆర్థికంగా నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉంది. ఫైనాన్షియల్ ఇంక్లూజన్ ద్వారా మాత్రమే దేశంలో సమానమైన, సమ్మిళిత వృద్ధి సాధ్యం అవుతుంది. కనీస బ్యాంకింగ్ సర్వీసులు కూడా అందుకోగల భాగ్యం లేని అల్పాదాయ వర్గాలు, బలహీన వర్గాలకు సరైన సమయానికి, సరసమైన ధరల్లో అవసరమైన సేవలు అందుబాటులో ఉంచడమే ఫైనాన్షియల్ ఇంక్లూజన్.

పేదల పొదుపు మొత్తాలను వ్యవస్థీకృత ఫైనాన్షియల్ వ్యవస్థలోకి రప్పించడం, గ్రామాల్లో వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న తమ కుటుంబాలకు డబ్బు పంపగలిగే వ్యవస్థను అందుబాటులోకి తేవడం అత్యంత కీలకం. ఈ దిశగా తీసుకున్న చొరవే ప్రధానమంత్రి జన్-ధన్ యోజ (పిఎంజెడివై). ప్రపంచంలోని అతి పెద్ద ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కార్యక్రమం ఇది.

2014 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిఎంజెడివై పథకాన్ని ప్రకటించారు. ఆగస్టు 28న ఈ పథకాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తూ పేదలకు విషవలయం నుంచి విముక్తి లభించే సందర్భంగా దీన్ని వేడుక చేసుకోవచ్చునన్నారు.

పిఎంజెడివైపై ఆర్థిక శాఖ సహాయమంత్రి డాక్టర్ భగవత్ కరడ్ తన ఆలోచనలు పంచుకుంటూ "భారతదేశంలోనే కాకుండా యావత్ ప్రపంచంలోను సమాజంలోని మారుమూల ప్రాంతాలకు కూడా చేరేందుకు తీసుకున్న ప్రధాన కార్యక్రమాల్లో ప్రధానమంత్రి జన్-ధన్ యోజన (పిఎంజెడివై) ఒకటి. సమ్మిళిత వృద్ధికి దోహదపడే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సాధించడం ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యతల్లో ఒకటి. పేదప్రజలు తమ పొదుపును వ్యవస్థీకృత ఆర్థిక వ్యవస్థలోకి తెచ్చేందుకు, దూరంగా ఎక్కడో గ్రామాల్లో నివశిస్తున్నతమ కుటుంబీకులకు వబ్బు పంపడానికి, వారు వడ్డీ వ్యాపారుల ఉక్కు వలయం నుంచి బయటపడేందుకు దోహదపడే సాధనం ఇది" అన్నారు.

ఈ పథకం 8వ వార్షికోత్సవం దాని ప్రాధాన్యతను చాటి చెబతోంది. ప్రభుత్వ ప్రజానుకూల ఆర్థిక విధానాలకు ఇది పునాదిగా నిలిచింది. ప్రత్యక్ష నగదు బదిలీ, కోవిడ్-19 ఆర్థిక సహాయం, పిఎం-కిసాన్, ఎంజిఎన్ ఆర్ఇజిఎ, జీవితబీమా, ఆరోగ్య బీమా కవరేజి...ఇలా అన్నింటికీ ఇది మూలంగా నిలిచింది. ఈ పథకం ప్రధాన లక్ష్యం ప్రతీ ఒక్క వయోజనునికి బ్యాంకు ఖాతాలు అందించడం అనేది ఇంచుమించుగా పూర్తయింది అని శ్రీ కరడ్ చెప్పారు.

బ్యాంకులు ప్రస్తుత వాతావరణానికి అనుకూలంగా స్పందిస్తాయని జాతీయ స్థాయిలో చేపట్టిన ఈ చొరవను మరింతగా ముందుకు నడపడానికి మరింత కృషి చేస్తాయని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతీ ఒక్క వయోజనుని ఫైనాన్షియల్ ఇంక్లూజన్ లో భాగస్వామిని చేయడానికి పునరంకితం అవుతాయని నాకు విశ్వాసం ఉంది అని శ్రీ కరడ్ అన్నారు.

# ప్రభుత్వ ఈ మార్కెట్ ప్లేస్ (జిఇఎమ్) పనితీరు,పురోగతిని సమీక్షించిన శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, ఆగష్టు 29: ప్రభుత్వ ఈ మార్కెట్‌ప్లేస్ ( జిఇఎమ్) పనితీరు, పురోగతిని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ మరియు జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ సమీక్షించారు.

జిఇఎమ్ అమలు చేస్తున్న వివిధ ప్రణాళికలు, సేకరణ మరియు సరఫరా, సమయపాలన తదితర అంశాలను మంత్రి సమీక్షించారు. 2022 ఏప్రిల్ నుంచి జిఇఎమ్ సమయపాలన మెరుగుపడిందని సమీక్షలో గుర్తించారు. జిఇఎమ్ ద్వారా చెల్లింపులు జరిగిన లావాదేవీల్లో 95% కంటే ఎక్కువ సరుకులను సమయానికి అందించినట్టు సమీక్షలో వెల్లడయింది.

జిఇఎమ్ ద్వారా జరిగిన అన్ని లావాదేవీలు రకాలు (ప్రత్యక్ష కొనుగోళ్లు ,ఎల్ 1, బిడ్లు / రివర్స్ వేలం) ఆన్-టైమ్ సరఫరా స్థిరమైన మెరుగుదల ఉందని గుర్తించారు. అయితే, సరఫరాను మరింత వేగవంతం చేయడానికి, ప్రభుత్వ కొనుగోలుదారులకు మరిన్ని వెసులుబాట్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ కొనుగోలుదారులకు తమ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను ఎంచుకునే వెసులుబాటు కల్పించాలని అన్నారు.

జిఇఎమ్‌లో వస్తువులు కొనుగోలు చేసిన కొనుగోలుదారులు అన్ని చెల్లింపులు చేసేందుకు ఆన్ లైన్ విధానాన్ని ప్రవేశ పెట్టి సరఫరా జరుగుతున్న తీరును పర్యవేక్షించేందుకు పటిష్ట వ్యవస్థకు రూపకల్పన చేయాలని శ్రీ గోయల్ సూచించారు.

సూక్ష్మ మరియు చిన్న పరిశ్రమలను ప్రోత్సహించి ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు అన్ని ప్రభుత్వ కొనుగోళ్ళు జిఇఎమ్‌లో జరిగేలా చూసేందుకు పారదర్శక ఆన్‌లైన్ విధానం పూర్తిగా అమలులోకి రావాల్సి ఉంటుందని చెప్పారు.

కుట్రపూరిత వ్యవహారాలు, మోసాలను గుర్తించి నివారించడానికి జిఇఎమ్ అమలు చేస్తున్న ఎ-ఓఓ విధానాలను మంత్రి సమీక్షించారు. దీనితో పాటు సేకరణ సమయంలో అవకతవకలు నివారించేందుకు అమలు చేస్తున్న పర్యవేక్షణ చర్యలను కూడా శ్రీ గోయల్ చట్టవ్యతిరేక, మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడే కొనుగోలుదారులు మరియు సరఫరాదారులపై చర్యలు తీసుకునేందుకు పటిష్టమైన చట్టపరమైన మరియు శిక్షాత్మక చర్యలను తీసుకోవాలని శ్రీ గోయల్ సూచించారు.

అవకతవకలను గుర్తించడంతో పాటు కొనుగోలుదారులకు వస్తువుల వివరాలు అందించేందుకు, ప్రజలు ఖర్చు తగ్గించేందుకు సహకరించేందుకు ఎ-ఓఓ ని ఉపయోగించేందుకు కూడా జిఇఎమ్ ప్రణాళిక రూపొందిస్తుంది.

వినియోగదారులకు అవసరమైన సౌకర్యాలు, సేవలు అందించేందుకు అధునాతన సాంకేతిక అంశాలను ఉపయోగించాలని జిఇఎమ్ నిర్ణయించింది.ఎంఎస్ఎంఈ ల కోసం జిఇఎమ్ అమలు చేస్తున్న కార్యక్రమాలు, నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ప్రచారం అనేక ఇతర కార్యక్రమాలు మంత్రి అభినందించారు.

# పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

## -మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి



మెదక్, ఆగష్టు 29: నేటినిజం (ప్రతినిధి):పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు . సోమవారం స్థానిక ద్వారక ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మెదక్‌మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా మంజూరైన 1247 ఆసరా పెన్షన్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు.. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పెన్షన్ల పథకాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం నెలకు రెండు వందల రూపాయలు మాత్రమే పెన్షన్ ఉండేదని, దానిని ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెన్షన్ వెయ్యి రూపాయలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు ఆ తర్వాత ఆ పెన్షన్ మొత్తాన్ని 2016 పెంచడం జరిగిందన్నారు.. వృద్ధులతోపాటు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు, గీత కార్మికులకు, చేనేత కార్మికులకు ,ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ,బోదకాలు వ్యాధిగ్రస్తుల కు ,పెన్షన్ ఇస్తున్నట్టు ఆమె తెలిపారు.. కరోనాతో దేశం ప్రపంచం ఆర్థిక సంక్షోభంలో కురుకుపోయిన పేదలకు ఇబ్బంది కలగకూడదు అన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడు పెన్షన్లు ఆపకుండా పంపిణీ చేసేలా ఏర్పాటు చేశారన్నారు ఎమ్మెల్యే పద్మ అన్నారు. మరింత ఎక్కువ మందికి ఆసరా పెన్షన్ లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో పెన్షన్ వయసు 57 సంవత్సరాల కుదించి నట్టు ఆమె తెలిపారు.. తద్వారా మెదక్ జిల్లాలో కొత్తగా21 వేల మంది పెన్షన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఆసరా పథకం కింద నెలకు 2016 పెన్షన్ ఇస్తుండటంతో వృద్ధులు తమకు అవసరమైన నెలవారి మందులకు ఎవరిపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా పోయిందన్నా రు...పేదల ఆడబిడ్డల పెళ్ళికి ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి 116,000ఆర్థిక సహాయాన్ని అందిస్తు న్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్ర పాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తాం : స్పీకర్ పోచారం




కామారెడ్డి, ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం (మేజర్ ద్యానచంద్ జయంతి) సందర్భంగా యువజన, క్రీడా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బాన్సువాడ పట్టణం మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హాకీలో దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన గొప్ప క్రీడాకారుడు ద్యానచంద్. తన ప్రతిభతో వ్యక్తిగతంగా ప్రపంచంలోనే అత్యధికంగా గోల్స్ చేసిన హాకీ మాంత్రికుడు ద్యానచంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు మనం ఘనంగా అర్పించే నివాళి అన్నారు.

బాన్సువాడ పట్టణంలోని క్రీడాకారుల సౌలభ్యం కోసం అన్ని వసతులతో మినీ స్టేడియం నిర్మించాం. క్రీడాకారులు దీనిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్పీకర ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజా గౌడ్, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ ఎంపీ పొంగులేటి



తిరుపతి , ఆగష్టు 29: తెరాస రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉదయం తిరుమల వేంకటేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఇటీవల వారి కుమార్తె వివాహం జరిగిన సందర్భంగా కుటుంబ సమేతంగా తిరుమలకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. పొంగులేటి శ్రీనివాస రెడ్డి దంపతులతో పాటు స్వామివార్లను దర్శించున్నవారిలో సోదరుడు పొంగులేటి ప్రసాద రెడ్డి దంపతులు, వియ్యంకులు రామసహాయం రఘురామిరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు.

# రాష్ట్రంలో అర కోటికి చేరిన ఆసరా పెన్షన్లు : మంత్రి ఎర్రబెల్లి



మహబూబాబాద్,ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): : రాష్ట్రంలో ఆసరా పెన్షన్ల సంఖ్య అరకోటికి చేరింది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఈ స్థాయిలో పెన్షన్స్ ఇస్తున్న దాఖలాలు లేవు. ఇది తెలంగాణ ప్రభుత్వం ఘనత అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంవెలికట్ట గ్రామంలో లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు 20 లక్షలుగా ఉన్న పెన్షన్ల సంఖ్యను తెలంగాణ వచ్చాక 40 లక్షలకు పెంచాలరని మంత్రి తెలిపారు.

తాజాగా 65 సంవత్సరాల వయసు నుంచి 57 సంవత్సరాలకు ఇస్తూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం కారణంగా మరో 10 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు మంజూరైనట్లు మంత్రి తెలిపారు. ఈ మొత్తం సంఖ్య యాభై లక్షలకు చేరిందని మంత్రి స్పష్టం చేశారు.

కేంద్రం రూ.200 కోట్లు మాత్రమే ఇస్తూ ఆరు లక్షల మందికి పెన్షన్లు అందజేస్తుందని, అదే తెలంగాణ ప్రభుత్వం 50 లక్షల మందికి ఏడాదిన రూ. 1200 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని మంత్రి వివరించారు.

ఉమ్మడి రాష్ట్రంలో రూ.200 రూపాయలకు మించని పెన్షన్ ని రెండుసార్లు పెంచి వృద్ధులకు, ఇతరులకు రూ.2,016, దివ్యాంగులకు రూ.3,016 ఇస్తున్నామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో 100 నుంచి 500కు మించడం లేదని మంత్రి పేర్కొన్నారు.

రాష్ట్రంలో వినూత్నంగా రూపొందించి అమలు చేస్తున్న అన్ని పథకాలకు మానవీయ కోణాన్ని జత చేశారని, అందులో భాగంగా పింఛన్‌దారులకు గతంలో ఎప్పుడు ఎక్కడ లేని విధంగా పెన్షన్లు అందజేస్తున్నారని అన్నారు.

# విత్తన గణపతి విగ్రహాలు పంపిణి చేసిన పోలీస్ కమిషనర్



ఖమ్మం,ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో కల్లూరులో చేపట్టిన విత్తన గణపతి విగ్రహాలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యతిధిగా హజరైన పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా విత్తన గణపతి విగ్రహాలను స్ధానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోడానికి విత్తన గణేశుడిని ముందుకు తీసుకెళ్లి మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడుదామన్నారు.

పర్యావరణ హితమైన ఇలాంటి కార్యక్రమాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ..

వినాయక చవితికి విత్తన గణపతి విగ్రహాలను ప్రజలకు పంచాలని తద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడుదాం అంటూ పర్యావరణానని కాపాడే బాధ్యతను గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణకై.. మన ఇంట్లో విత్తన గణపతినే పూజిద్దాం.. అనంతరం ఒక మొక్కకు జన్మనిద్దాం అంటూ పిలుపునిచ్చారు. గణేశునితో పాటు ఇచ్చే కొబ్బరిపీచు తొట్టిలోని ఆ విత్తనాలు 7 రోజుల్లో మొలకెత్తుతాయని అన్నారు. పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను పూజకు ఉపయోగించే విధంగా ఒక ఆకర్షణీయమైన బ్యాగ్‌లో విత్తన గణేషుడి విగ్రహాన్ని ప్యాక్ చేసి ఈ కార్యక్రమంలో పంపిణీ చేశారు.

కార్యక్రమంలో వైరా ఏసీపీ రహెమాన్, స్ధానిక ప్రజలు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడేందుకు అందరు విధిగా మట్టి వినాయకులను వాడాలి



మెదక్, ఆగష్టు 29: నేటినిజం (ప్రతినిధి):పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత అని, పర్యావరణా న్ని కాపాడేందుకు అందరు విధిగా మట్టి వినాయకులను వాడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్ ఆవరణలో అదనపు కలెక్టర్ రమేష్ తో కలిసి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి (ఎ.వా.ఖ.అః) వారి సౌజన్యంతో పర్యావరణ పరిరక్షణ కోసం తయారు చేసిన మట్టి వినాయకుల ప్రతిమలను ఉ చితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు మట్టి గణపతులనే పూజిద్దామని, రంగు విగ్రహాలను మానేద్దామని ప్రజలకు హితవు పలికారు. ప్రస్తుత పరిస్థితులలో ప్లాస్టరాఫ్ పారిస్ తో పర్యావరణానికి విఘాతం కలిగించే విధంగా తయారు చేసే రంగు రంగుల వినాయకులను కాకుండా మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను పూజించాలని అన్నారు. మట్టి వినాయకులను ఉపయోగించడం వలన నీటి కాలుష్యం నివారించటంతో పాటు నిరుద్యోగ కుమ్మరి కులస్థులకు జీవనోపాధి కల్పించినట్టు అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 2000, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీ ల పరిది లో 500ల చొప్పున మట్టి వినాయకులను అందేజేస్తున్నామని అన్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల పరిదిలో 8,290, పర్యావరణ పరిరక్షణ ఆద్వర్యంలో 1000 చొప్పున, వెరసీ జిల్లా వ్యాప్తంగా 12,790 మట్టి వినాయకుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ప్రతిమ సింగ్ వివరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో అధికారులకు, అనధికారులకు, ప్రజలకు మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బి. కేశురాం, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యం. నాగరాజు గౌడ్, ఖఅః, ం.ఇ అజయ్. బి.సి. కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, లవన్, అంజయ్య, అరిఫ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జాతీయ జెండా.... మంత్రి ఎర్రబెల్లి



మహబూబాబాద్,ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూర్ జిల్లా పరిషత్ స్కూల్ ఆవరణలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్రంలో రెండో అతిపెద్ద 100 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ డాక్టర్ సోమేశ్వర్ రావు మరియు ఇతర దాతలు కలిసి కమిటీ గా ఏర్పడి జాతీయ సమైక్యతా కోసం ఈ బృహత్ కార్యాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయం అని

దీని నిర్మాణం కోసం కేవలం 15 రోజుల్లో రాత్రి, పగలు కష్టపడి నిర్మాణం చేయడం అధికారులు ప్రజా ప్రతినిధుల సమిష్టి కృషి అభినందనీయమని అన్నారు

ఈ జెండా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇదే ప్రధమం.

విద్యార్థులకు స్వాతంత్ర సంగ్రామం గురించి, దేశభక్తి భావాలను తెలియజేయాలి. ప్రతి ఇంటి పై జెండా ఎగరవేసే అవకాశం కల్పించడం హర్షణీయం. భారత స్వాతంత్ర సంగ్రామం, తదనంతర జాతి నిర్మాణంలో మువ్వన్నెల పతాక పోషించిన పాత్ర స్ఫూర్తిదాయకము అని అన్నారు.

దేశ స్వాతంత్ర్యం కోసం, ఐక్యత కోసం తన, మన, ధన, ప్రాణత్యాగాలు చేసిన వారందరినీ గుర్తుచేసుకుని వారి త్యాగాల స్ఫూర్తితో నవభారత నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలనే గొప్ప సంకల్పంతో తొర్రూరు లో భారీ జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయము అన్నారు.

సీఎం కెసిఆర్ ఇప్పటికే దేశంలో ఎక్కడా లేని విధంగా భారత స్వతంత్ర వజ్రోత్సవాలు నిర్వహించి అందరిలో జాతీయ భావాన్ని పెంచారని ,ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి ఇప్పటికే మన ఐకమత్యాన్ని చాటామని అన్నారు.

సీఎం కెసిఆర్ గాంధీజీ అహింస మార్గం ద్వారా తెలంగాణ ను సాధించారు,సాధించిన తెలంగాణను గాంధీ, బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నారు

మన మధ్య విద్వేషాలు పెంచుతున్న అరాచక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉందామని,

ఐకమత్యంగా ఉండి అరాచక శక్తులను ఎదుర్కొందామని అన్నారు.

ఈ కార్యక్రమంలో స్వాతంత్ర సమరయోధులు చుక్కా రామయ్య , జిల్లా కలెక్టర్ కె. శశాంక, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్రావు,ఎమ్మార్వో రాఘవరెడ్డి , మునిసిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, స్థానిక జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, శ్రీనివాస్ రావు, టిఆర్ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి కుర్ర శ్రీనివాస్ గౌడ్, జై సింగ్ ,సురేష్ నాయక్ ,అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు,ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# మారుతి-సుజుకి విజయమే భారత-జపాన్ బలమైన భాగస్వామానికి నిదర్శనం-ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 29: భారతదేశంలో సుజుకి వ్యవస్థాపనకు 40 ఏళు నిండిన సందర్భంగా గాంధీనగర్లోని మహాత్మా మందిర్లో ఇవాళ నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. భారత్లో జపాన్ రాయబారి గౌరవనీయ సతోషి సుజుకి, గుజరాత్ ముఖ్యమంత్రి, శ్రీ భూపేంద్ర పటేల్, పార్లమెంటు సభ్యుడు, శ్రీ సి.ఆర్.పాటిల్, రాష్ట్ర మంత్రి శ్రీ జగదీష్ పంచాల్, సుజుకి మోటార్ కార్పొరేషన్ ప్రస్తుత అధ్యక్షుడు శ్రీ టి.సుజుకి మాజీ అధ్యక్షుడు శ్రీ ఒ.సుజుకి, మారుతి-సుజుకి చైర్మన్ శ్రీ ఆర్.సి.భార్గవ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హర్యానా ముఖ్యమంత్రి శ్రీ మనోహర్ లాల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనగా, జపాన్ ప్రధానమంత్రి మాననీయ ఫుమియో కిషిడా పంపిన వీడియో సందేశం ప్రదర్శించబడింది.

ఈ సందర్భంగా జపాన్ ప్రధాని కిషిడా శుభాకాంక్షలు తెలియజేస్తూ- నాలుగు దశాబ్దాలుగా మారుతి-సుజుకి పురోగమనం భారత-జపాన్ల మధ్య బలమైన ఆర్థిక సంబంధాలకు నిదర్శనంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. భారత మార్కెట్ సామర్థ్యాన్ని గుర్తించడంపై సుజుకి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. "భారత ప్రజల అవగాహన, ప్రభుత్వ మద్దతు వల్లనే ఈ విజయం సాధ్యమైందని నా అభిప్రాయం. ఇక ప్రధానమంత్రి మోదీ బలమైన నాయకత్వ నిర్దేశంలో తయారీ రంగానికి మద్దతుగా ఇటీవల పలు చర్యలు చేపట్టడంతో భారత ఆర్థిక వృద్ధి మరింత వేగం పుంజుకుంటోంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమ దేశానికి చెందిన అనేక కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులకు ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయని వెల్లడించారు. భారత-జపాన్ స్నేహబంధానికి 70 ఏళ్లు పూర్తికావడం కూడా ఈ సంవత్సరం ప్రాముఖ్యాన్ని స్పష్టం చేస్తున్నదని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ప్రధాని మోదీతో సంయుక్తంగా 'భారత-జపాన్ వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని' మరింత ముందుకు తీసుకెళ్లడంతోపాటు 'స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ ప్రాంతం' సాప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ- సుజుకి కార్పొరేషన్తో అనుబంధంగల ప్రతి ఒక్కరినీ అభినందించారు. "భారతదేశంలోని అనేక కుటుంబాలతో సుజుకి అనుబంధం 40 ఏళ్లనుంచీ బలంగా కొనసాగుతోంది" అని ఆయన పేర్కొన్నారు. "మారుతి-సుజుకి విజయం భారత-జపాన్ బలమైన భాగస్వామానికి నిదర్శనం. గత ఎనిమిదేళ్లలో, మన రెండు దేశాల మధ్య సంబంధాలు సరికొత్త శిఖరాలకు చేరాయి. నేడు గుజరాత్-మహారాష్ట్ర మధ్య బుల్లెట్ రైలు నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బనారస్లోని రుద్రాక్ష కేంద్రం దాకా అనేక అభివృద్ధి కార్యక్రమాలు భారత-జపాన్ స్నేహానికి నిదర్శనాలు" అని ప్రధానమంత్రి వివరించారు. అలాగే "ఈ స్నేహం విషయంలో మన మిత్రుడు, జపాన్ మాజీ ప్రధాని దివంగత షింజో అబెను ప్రతి భారతీయుడూ కచ్చితంగా గుర్తుకు తెచ్చుకుంటాడు" అని ప్రధాని పేర్కొన్నారు. అబే సాన్ గుజరాత్కు వచ్చి కొంత సమయం ఇక్కడ గడిపడాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన రాకను గుజరాత్ ప్రజలు అప్పుడప్పుడూ ఎంతో ప్రేమగా జ్ఞప్తికి తెచ్చుకుంటుంటారని చెప్పారు. "మన రెండు దేశాలను మరింత సన్నిహితం చేయడానికి సాగిన ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్లడం కోసం జపాన్ ప్రస్తుత ప్రధాని కిషిడా కూడా తనవంతు కృషి చేస్తున్నారు" అని వివరించారు.

గుజరాత్లో 13 ఏళ్ల కిందట సుజుకి ప్రవేశాన్ని, సుపరిపాలనకు నమూనాగా ఈ రాష్ట్రం తననుతాను రుజువు చేసుకోవడాన్ని ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. "సుజుకి సంస్థకిచ్చిన హామీని గుజరాత్ నిలబెట్టుకున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. సుజుకి కూడా అంతే గౌరవంగా గుజరాత్ ఆకాంక్షలను నెరవేర్చింది. ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఆటోమోటివ్ కూడలిగా గుజరాత్ అవతరించింది" అన్నారు. గుజరాత్-జపాన్ మధ్య సంబంధాల గురించి ప్రముఖంగా ప్రస్తావిస్తూ- ఇది రెండు దేశాల దౌత్య కోణానికి అతీతమైనదిగా ప్రధాని పేర్కొన్నారు. "నాకు గుర్తున్నంతవరకూ 2009లో 'ఉజ్వల గుజరాత్' సదస్సు ప్రారంభమైన నాటినుంచి రాష్ట్రంతో భాగస్వామ్య దేశంగా జపాన్ తన అనుబంధాన్ని కొనసాగిస్తోంది" అని ప్రధానమంత్రి అన్నారు. జపాన్ పెట్టుబడిదారులకు స్వదేశంలోనే ఉన్నామన్న అనుభూతి కలిగే విధంగా గుజరాత్లో 'సూక్ష్మ జపాన్' సృష్టికి తాను సంకల్పించానని ఆయన గుర్తు చేసుకున్నారు. దీన్ని సాకారం చేసేందుకు అనేక చిన్నచిన్న చర్యలు తీసుకున్నామని తెలిపారు. అందులో భాగంగా అంతర్జాతీయ స్థాయి గోల్ఫ్ కోర్సులు, జపాన్ వంటకాలు రుచిచూపించే రెస్టారెంట్లు, జపాన్ భాషకు ప్రాచుర్యం కల్పించేందుకు కృషి వంటి ప్రయత్నాలను ఈ సందర్భంగా ఉ దాహరించారు. "జపాన్ విషయంలో మన చర్యలు సదా హుందాగా.. గౌరవంతో కూడినవి కాబట్టే సుజుకి సహా దాదాపు 125 జపాన్ కంపెనీలు గుజరాత్లో పనిచేస్తున్నాయి" అని గుర్తుచేశారు. సుజుకితో పాటు దాదాపు 125 జపాన్ కంపెనీలు గుజరాత్లో పనిచేస్తున్నాయి" అని ఆయన చెప్పారు. అహ్మదాబాద్లోని 'జెట్రో' (ఏఇఖీూ) నడుపుతున్న సహాయ కేంద్రం అనేక కంపెనీలకు తక్షణ సౌకర్యాలను అందిస్తోందని పేర్కొన్నారు. అలాగే జపాన్-భారత తయారీ శిక్షణ సంస్థ చాలా మందికి శిక్షణ ఇస్తోందని తెలిపారు. గుజరాత్ అభివృద్ధి ప్రయాణంలో 'కైజెన్' పోషించిన పాత్రను ప్రధాని ప్రశంసించారు. 'కైజెన్' సంబంధిత అంశాలను తాను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) సహా ఇతర శాఖలలోనూ అమలు చేశామని ప్రధానమంత్రి చెప్పారు.

విద్యుత్ వాహనాలకుగల విశిష్టతలను వివరిస్తూ- అవి నిశ్శబ్దంగా పనిచేస్తాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. వాహనం రెండు చక్రాలదైనా, నాలుగు చక్రాలదైనా ఎలాంటి శబ్దం చేయదని చెప్పారు. "ఈ నిశ్శబ్దం కేవలం దాని ఇంజనీరింగ్ విశిష్టతలోనే కాకుండా దేశంలో నిశ్శబ్ద విప్లవానికి నాంది పలికేది ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. విద్యుత్ వాహన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేసే ప్రభుత్వ కృషిలో భాగంగా విద్యుత్ వాహన కొనుగోలుదారులకు వివిధ ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు ప్రధానమంత్రి తెలిపారు. ఈ మేరకు ఆదాయపు పన్నులో రాయితీ, రుణ ప్రక్రియను సరళీకరణ వంటి అనేక చర్యలు అనేకం చేపట్టినట్లు తెలిపారు. "సరఫరా పెంపు దిశగా వాహన-విడిభాగాల తయారీ రంగానికి 'ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహకం' (పీఎల్ఐ) వంటి పథకాలు ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాం" అని ప్రధానమంత్రి వెల్లడించారు. అలాగే పటిష్ట విద్యుత్ వాహన ఛార్జింగ్ మౌలిక వసతుల కల్పనకు అనువుగా అనేక విధాన నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. "ఇందులో భాగంగా 2022 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో బ్యాటరీ మార్పిడి విధానం ప్రవేశపెట్టాం" అని ప్రధాని చెప్పారు. అలాగే "సరఫరా.. డిమాండ్.. పర్యావరణ వ్యవస్థల బలోపేతంతో విద్యుత్ వాహన రంగం కచ్చితంగా పురోగమిస్తుంది" అన్నారు.

వాతావరణ మార్పుపై 'కాప్-26' సదస్సు సందర్భంగా భారతదేశం 2030 నాటికల్లా శిలాజేతర ఇంధన వనరుల నుంచి తన స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 50 శాతాన్ని సాధించగలదని ప్రకటించినట్లు ప్రధాని గుర్తుచేశారు. అదేవిధంగా "మనం 2070 నాటికి 'నికర శూన్య' ఉద్గారస్థాయిని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ప్రధానమంత్రి తెలిపారు. మారుతి-సుజుకి కూడా జీవ ఇంధనం, పెట్రోల్-డీజిల్లో ఇథనాల్ మిశ్రమం, హైబ్రిడ్ విద్యుత్ వాహనాల తయారీపైనా కృషి చేస్తుండటంపై ప్రధాని హర్షం ప్రకటించారు. ఈ నేపథ్యంలో 'కంప్రెస్డ్ బయోమీథేన్ గ్యాస్' సంబంధిత ప్రాజెక్టు పనులను కూడా సుజుకి ప్రారంభించాలని ఆయన సూచించారు. ఆరోగ్యకర పోటీ, అనుభవాల ఆదానప్రదానానికి మెరుగైన వాతావరణం సృష్టించబడాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు. "ఇది దేశానికి, వాణిజ్యానికీ ప్రయోజనకరం కాగలదు" అని ఆయన అన్నారు. "రాబోయే 25 సంవత్సరాల అమృత కాలంలో భారతదేశం తన ఇంధన అవసరాల్ల స్వయం సమృద్ధి సాధించడమే మా లక్ష్యం. ఇంధన వినియోగంలో ప్రధాన వాటాదారు రవాణా రంగం కాబట్టి, ఈ రంగంలో ఆవిష్కరణలు, కృషి మన ప్రాథమ్యాలుగా ఉండాలి. తద్వారా మనం ఈ లక్ష్యాన్ని సాధించగలమని నాకు నమ్మకముంది" అని ఆయన తన ప్రసంగం ముగించారు.

## నేపథ్యం

ఈ కార్యక్రమంలో భాగంగా భారతదేశంలో సుజుకి సంస్థకు సంబంధించిన రెండు కీలక ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు- వీటిలో? గుజరాత్లోని హన్సల్పూర్లో నిర్మించనున్న 'సుజుకి మోటార్ గుజరాత్ ఎలక్ట్రిక్ వెహికల్ బ్యాటరీ తయారీ' కర్మాగారం, హర్యానాలోని ఖర్ఖోదాలో మారుతి-సుజుకి రూపొందిస్తున్న వాహన తయారీ కేంద్రం ఉన్నాయి. కాగా, గుజరాత్లోని హన్సల్పూర్లో సుజుకి మోటార్ గుజరాత్ ఎలక్ట్రిక్ వెహికల్ బ్యాటరీ తయారీ కర్మాగారం దాదాపు రూ.7,300 కోట్లతో ఏర్పాటవుతోంది. ఇక్కడ విద్యుత్ వాహనాల కోసం 'అడ్వాన్స్ కెమిస్ట్రీ సెల్ బ్యాటరీ'లు తయారు చేస్తారు. ఇక హర్యానాలోని ఖర్ఖోదాలో ఏర్పాటయ్యే వాహన తయారీ కేంద్రం ఏటా 10 లక్షల ప్రయాణిక వాహనాలను తయారు చేయగలదు. ఈ కేంద్రం తొలిదశ పనులను రూ.11,000 కోట్లతో చేపడుతున్న నేపథ్యంలో అన్ని దశలూ పూర్తయ్యాక ప్రపంచంలో ఒకేచోటగల అతిపెద్ద ప్రయాణిక వాహన తయారీ కేంద్రంగా ఇది రికార్డులకెక్కుతుంది.

# పేద ప్రజల అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది



-జిల్లాలో కొత్తగా ఆసరా పింఛన్లు 8 వేల 424 మంజూరు.

-ఆసరా పింఛన్ల కార్డుల పంపిణీ చేసిన రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్.

ములుగు , ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి):పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర గిరిజన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆసరా పింఛన్ల కార్డుల జారీ కార్యక్రమంలో 9 మండలాలకు చెందిన 8 వేల 4 వందదాల్ 24 మంది లబ్ధిదారులకు నూతన ఆసరా పింఛను కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 33 వేల 179 పెన్షనర్లు ఉండగా, కొత్తగా 8424 మందికి పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

స్వయం పాలనలో అర్హులైన అందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వాలని సీఎం కేసీఆర్ చెప్పారన్నారు.

అభివృద్ధి తో పాటు సంక్షేమం రెండు కండ్లుల కెసిఆర్ చూస్తున్నారని గతంలో ఇందిరాగాంధీ గరీబ్ హటావో, ఎన్టీఆర్ రెండు రూపాయల కిలో బియ్యం, జనాలకు జనత బట్టలు సంక్షేమ రుచి చూపించారని అలా మంచి మనసుతో రాష్ట్ర ముఖ్యమంత్రి పార్టీలకతీతంగా అన్ని వర్గాల వారికి సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని రాష్ట్ర ప్రజల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆమె అన్నారు.

జిల్లాలో గతంలో వృద్ధాప్య పింఛన్లు 12016, వితంతువులు 15,553, దివ్యాంగులు 3683, చేనేత కార్మికులకు 184, గీత కార్మికులకు 214, బీడీ కార్మికులకు 89, ఒంటరి మహిళలకు 1440 ప్రభుత్వం అందిస్తుందని జిల్లాకు 7 కోట్ల 7లక్షల 62 వేల 224 రూపాయలు మంజూరు చేసిందని ఆమె తెలిపారు.

జిల్లాలో ఇప్పుడు వృద్ధాప్య పింఛన్లు 5583, వితంతువులు 2056, దివ్యాంగులు 569, చేనేత కార్మికులకు 35, గీత కార్మికులకు31, బీడీ కార్మికులకు4, ఒంటరి మహిళ లకు 146, ప్రభుత్వం అందిస్తుందని జిల్లాకు 1 కోటి 75లక్షల 51 వేల 784 రూపాయలు మంజూరు చేసిందని ఆమె తెలిపారు.

75 ఏళ్ల స్వాతంత్ర పురస్కరించుకొని వజ్రోత్సవాలను 15 రోజులపాటు జిల్లాలో ఘనంగా నిర్వహించుకున్నామని ఆమె అన్నారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఉన్న ములుగును సిఎం కేసిఆర్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారని ఆమె గుర్తు చేశారు.

ములుగు కలెక్టరేట్ భవనం నిర్మాణానికి 65 కోట్లు మంజూరు చేసి టెండర్లు అగ్రిమెంటు పూర్తయిందని త్వరలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయుటకు జిల్లాకు రానున్నరని ఆమె తెలిపారు. ఏటూర్ నాగారంలో డయాలసిస్ సెంటర్ త్వరలో వైద్యశాఖ మంత్రి తో ప్రారంభిస్తామన్నారు.

రామప్ప వరల్డ్ హెరిటేజ్ 33 కోట్ల



80 లక్షల రూపాయలు మంజూరు చేసి ఆరు కోట్ల రూపాయ లతో ఆలయ అభివృద్ధి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టడం జరుగుతున్నదని అన్నారు.

జిల్లాలో వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు ఆమె తెలిపారు. పింఛన్ కోసం వేలిముద్రతో అవసరం లేకుండా పోస్ట్ ఆఫీస్ స్మార్ట్ కార్డు ద్వారా పింఛన్ పొందవచ్చని అన్నారు.

జిల్లాలో ధ్వంసమైన రోడ్ల ప్రతిపాదనలు పంపాలని చెరువులు తెగ కుండా కరకట్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలు అధికారులు సెప్టెంబర్ వరకు సమర్పించాలని కోరారు.

జిల్లాలోని ఎస్టీ మహిళా డిగ్రీ కళాశాల ఓగ్లాపూర్ నుండి పీఎంఆర్సి భవనం ఏటూరు నాగారనికి మారుస్తున్నట్లు ఆమె అన్నారు.

జిల్లా ఆస్పత్రి ఏర్పాటు కోసం శంకుస్థాపన చేశామని సిటీస్కాన్ 1250 సిటీ స్కామ్ చేసేమని గిరిజన భవన్ లో క్లైన్ కోట్ ఓపెన్ చేస్తామని, ములుగు జిల్లాను అనిరంగంలో అభివృద్ధి పరుస్తామని ఆమె తెలిపారు.

జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన ఆసరా పెన్షన్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు నిండు మనసుతో ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని ఆయన కోరారు.

జిల్లా కలెక్టర్ ఎస్. క్రిష్ణ ఆదిత్య మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి పింఛన్లు కొరకు ఎక్కువ దరఖాస్తులు వచ్చేవని ఇప్పుడు కొత్త పింఛన్లు మన జిల్లాకు 8 424 మంజూరు కావడం శు భసూచికమని జిల్లా అభివృద్ధి కోసం అధికారులు వరదల సమయంలో అప్రమత్తంగా పనిచేశారని 75 వ స్వాతంత్ర వజ్రోత్సవాల సందర్భంగా 15 రోజులు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించమని జిల్లా సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్ వివరించారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బడే నాగజ్యోతి, ఐటీడీపీఓ అంకిత్, అదనపు కలెక్టర్ వై వి గణేష్, ఆర్డీవో కే రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగ పద్మజ, జిల్లా రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ పల్ల బుచ్చయ్య, జిల్లా అధికారులు, జెడ్పిటిసిలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, తహసిల్దార్లు, ఎంపి డి ఓ లు, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, ఆసరా పింఛన్ లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో భారీగెట్ల వితరణ



ఖమ్మం,ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా బారీగెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ విష్ణు యస్.వారియర్ తెలిపారు. నగరంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ వారి సౌజన్యంతో వితరణగా అందజేసిన 250 బారీగెట్లను సోమవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. కమిషనరేట్ లో ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలను నియంత్రించేందుకు వీటిని వినియోగిస్తునట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.

కార్యక్రమంలో సీఎంఆర్ సిబ్బంది, అడ్వర్టైజింగ్ ఏజెన్సీ సునీల్, ఆర్ఐ సాంబశివరావు, సిఐ తుమ్మ గోపి, పాల్గొన్నారు.

# "స్మార్ట్ కిడ్జ" పాఠశాలలో వివిధ ఆకృతులలో గణపతుల ప్రతిమలను ప్రదర్శించిన విద్యార్థులు



ఖమ్మం,ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పిస్తూ "స్మార్ట్ కిడ్జ్" పాఠశాల చిన్నారులు వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను ప్రదర్శించారు.

తోలుత విద్యార్థులు

మట్టి మరియు పిండితో, కూరగాయలతో, పసుపుతో, డ్రై ఫ్రూట్స్ తో, కాగితంతో, అదేవిధంగా ముగ్గులతో చక్కగా అలంకరించి ప్రదర్శించారు. వివిధ రకాలుగా తయారుచేసిన వినాయక విగ్రహాలు ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులకు పర్యావరణ పరిరక్షించే విధంగా తగు జాగ్రత్తలు సూచనలు ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింత నిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ మట్టితో తయారుచేసిన మట్టి వినాయక విగ్రహాలనే పూజించడం అదేవిధంగా నిమజ్జనం చేయడం ద్వారా, పర్యావరణాన్ని పరిరక్షించుకోగలమని, ఎకో ఫ్రెండ్లీ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం వలన పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి మార్గం సులువుగా ఉంటుందని ఆయన అన్నారు, దీనిని అవగాహన కల్పించడం కోసమే పాఠశాలలో వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను తయారు చేయించి చిన్నారులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని తీసుకున్నామని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింత నిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు మరియు సిబ్బంది విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా ఢిల్లీ శ్రీవేంకటేశ్వర కళాశాల వజ్రోత్సవాలు



న్యూఢిల్లీ, ఆగష్టు 29: ఢిల్లీలోని శ్రీ వేంకటేశ్వర కళాశాల డైమండ్ జూబ్లీ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్య అతిథిగా హాజరై.. వజ్రోత్సవ సావనీర్ను విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీ షీలా రెడ్డి అతిథులకు స్వాగతం పలికిన ఈ కార్యక్రమానికి టీటీడీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. గౌరవ అతిథులుగా యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్ కుమార్, యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యోగేశ్ సింగ్ హాజరయ్యారు. ఎయిమ్స్ డైరెక్టర్, శ్రీ వేంకటేశ్వర కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ రణదీప్ గులేరియాను ప్రత్యేకంగా సత్కరించారు. అలాగే, కథక్ ద్వయం శ్రీమతి కమిలినీ, శ్రీమతి నళినితోపాటు పద్మశ్రీ అవార్డు గ్రహీతలు, అత్యున్నత స్థానంలో పనిచేసిన పలువురు పూర్వ విద్యార్థులను కూడా ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రసంగిస్తూ.. తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు, శ్రీవేంకటేశ్వర కళాశాల విద్యారంగంలో చేపడుతున్న కృషిని అభినందించారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కళాశాల న్యాక్ ఏ+ గ్రేడ్ను సాధించినందుకు అభినందనలు తెలిపారు. పరిశోధనల ఆవశ్యకతను నొక్కిచెప్పిన ఆయన.. భవిష్యత్లో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎక్కువ మంది పరిశోధకుల వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాశాలను ఆ దిశగా నడిపిస్తారన్న విశ్వాసాన్ని కేంద్ర మంత్రి వ్యక్తం చేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఢిల్లీలో ఏర్పాటైన శ్రీ వేంకటేశ్వర కళాశాల 1961 లో ప్రారంభమైంది. శ్రీమతి దుర్గాబాయి దేశ్ముఖ్, కేఎల్ రావు, సీ అన్నారావుతో ప్రేరణ పొంది ప్రారంభమైన ఈ కళాశాల ఈ ఏడాది 60 వసంతంలోకి అడుగిడింది. డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా సుస్థిర అభివృద్ధి కోసం ప్రాథమిక శాస్త్రం, మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ ప్రతినిధితో ఫీల్డ్ ఇంటరాక్షన్ కార్యక్రమాలు, సదస్సులను, వర్క్షాపులను ఏడాది పొడవునా నిర్వహించారు. డిజిటల్ ఎకనామిక్స్, పేట్రియాటిక్ పాటల పోటీలపై వెబినార్ కూడా చేపట్టారు.



ములుగుజిల్లా ఈ రోజు ములుగు మండలం లోని ఇంచేర్ల గ్రామములో GCCఆధ్వర్యములో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపును మంత్రి సత్యవతి రాథోడ్ గారితో కలిసి ప్రారంభించిన ములుగు ఎమ్మెల్యే సీతక్క

# గడ్డమీదిఅనసూర్య భౌతిక కాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్



ములుగు , ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా గడ్డమీది భాస్కర్ గౌడు గడ్డమీది శ్రీను గౌడ్ తల్లి గడ్డమీది అనసూర్య అనారోగ్య కారణాలతో ఈరోజు మరణించగ గడ్డమీది అనసూర్య భౌతిక కాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మంజల బిక్షపతి గౌడు అనంతరం హాయ్ మాట్లాడుతూ మా సర్దార్ సర్వాయి పాపన్న వారసులు కుటుంబం గడ్డమీది భాస్కర్ గౌడ్ గడ్డమీది శ్రీను గౌడ్ తల్లి గడ్డమీది అనసూర్య గౌడ్ మరణం చాలా తీరనిలోటని బిక్షపతి అన్నారు ఈ కార్యక్రమంలో బై గానే వేణు గౌడ్ కత్తి వెంకన్న గౌడ్ కార్మిక న్యాయ సామాజిక వేదిక జిల్లా అధ్యక్షులు నర్సయ్య గౌడ్ పైడి మల్ల సునీల్ గౌడ్ చోడ రాజు గౌడ్ పైడి మల్ల శివ గౌడ్ పైడి మల్ల గంగాధర్ గౌడ్ పైడి మల్ల శంకర్ గౌడ్ గౌడ సంఘం ములుగు పట్టణ అధ్యక్షులు బుర్ర జనార్దన్ గౌడ్ గౌడ సంఘం జిల్లా నాయకులు బుర్ర జనార్దన్ గౌడ్ ముస్లిం పెల్లి కుమార్ గౌడ్ రాజేందర్ గౌడ్ తదితరులు గౌడ ఐక్య వేదిక తెలుగు జిల్లా నాయకులు గడ్డమీద అనసూయ మృతదేహంపై పార్థివ మృతదేహంపై భౌతిక కాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన గౌడ సంగం ఏజెన్సీ గౌడ హక్కుల పోరాట సమితి సర్దార్ సర్వాయి పాపన్న వారసుడు ములుగు జిల్లా గౌడ ఐక్య వేదిక నాయకుడు ముంజల భిక్షపతి గౌడ్ ఘనంగా నివాళులు అర్పించారు

# సంక్షేమ భవన్లో మేజర్ ధ్యాన్చంద్, హాకీ లెజెండ్ గారి సంస్మరణ, దీప ప్రజ్వలన, పూల హార సమర్పణ



ములుగు , ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంల ప్రకారం జిల్లా కలెక్టర్ గారి ఆదేశములతో, ఈరోజు సంక్షేమ భవన్లో మేజర్ ధ్యాన్చంద్, హాకీ లెజెండ్ గారి సంస్మరణ, దీప ప్రజ్వలన, పూల హార సమర్పణ జరిగినది. కార్యక్రమమునకు విచ్చేసిన క్రీడాకారులకు కబడ్డీ, క్యారమ్స్, చెస్ అదేటిక్స్ ,మొదలైన, అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం జరిగినది అని జిల్లా యువజన క్రీడల అధికారి పి.వి.ఆర్ .చారి ఒక ప్రకటనలో తెలిపినారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈ .డి. ఎస్ .సి .కార్పొరేషన్ శ్రీ తుల రవి గారు హాజరైనారు. మరియు శ్రీమతి భాగ్యలక్ష్మి గారు సంజీవయ్య గారు పి.డి. రాజకుమార్ గారు జనార్ధన్ గారు కోచ్ కుమారస్వామి గారు రేణుక గారు, కార్యాలయ సిబ్బంది శ్రీమతి లావణ్య గారు హాజరై విజయవంతం చేసినారు. మరియు ఇనీజీఇష్ట్ర,ఖఆ లకు శాలువాతో సన్మానం చేయడం జరిగింది.దీని ప్రతి :ఆఖఖీూ ములుగు గారికి అన్ని దినపత్రికలలో ప్రచురించవలసిందిగా కోరుతూ సమర్పించబడినది.

# టమెరగని నేత అభివృద్ధి ప్రదాత... జలగం శేఖర్ పుస్తక రచయిత

మహబూబాబాద్,ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని తొర్రూరు జెడ్ పి ఎస్ ఎస్ హై స్కూల్లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి "ఎర్రబెల్లి దయాకర్ రావు 40 సంవత్సరాల రాజకీయ అభివృద్ధి ప్రస్థానం" అనే పుస్తకాన్ని పెద్ద వంగర మండలం చిన్న వంగర గ్రామానికి చెందిన టివి5 రిపోర్టర్ జలగం శేఖర్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రాజకీయంగా ఎదుర్కొన్నటువంటి ఎన్నో కష్టసుఖాలను తెలియజేస్తూ, ప్రజల గుండెల్లో నిలిచిపోయిన నేత అని,తన ఓటమెరుగని నాయకుడని తన జీవితాన్ని వర్ణిస్తూ రచించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అభివృద్ధి పథంలో ముందు ఉంటారని వర్ణించారు. మంత్రి దయన్న నీళ్ల కోసం కొట్లాడే ఉద్యమకారుడని, ప్రజల కోసం కొట్లాడె ప్రజానాయకుడని, వర్ణిస్తూ తన అభిమానాన్ని పుస్తక రూపంలో తెలియజేశాడు. ఈ కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్ బిఆర్ లెనిన్, టియుడబ్ల్యుజె (ఐజేయు) జాతీయ కౌన్సిల్ నెంబర్ దూలం శ్రీనివాస్ ,స్థానిక జడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్,ఎంపీపీ తూర్పాటి చిన అంజయ్య, డాక్టర్ సోమేశ్వరరావు, రిపోర్టర్లు ప్రసాద్ ,యాకన్న ,కార్యకర్తలు, నాయకులు, పత్రికా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.



# సహజసిద్ధ మట్టి ప్రతిమలను పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ

- ప్రత్యేకంగా రూపొందించిన వఇనీ ఫ్రెండ్లీ సీడ్ గణేశా ప్రతిమలు
- పూజల అనంతరం భూమిలో నిమజ్జనం
- పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ

ఖమ్మం,ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతులనే పూజించి, కాలుష్యన్ని నివారిద్దామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

ఖమ్మం వీడియో'స్ కాలనీ లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పువ్వాడ ప్రత్యేక చొరవతో సమకూర్చిన సహజమైన మట్టి తో చేసిన వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.

కాలుష్యం లేని పర్యావరణ హితం కోరే ఏకో ఫ్రెండ్లీ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ప్రజలకు మంత్రి పువ్వాడ విజ్ఞప్తి చేశారు.

సహజసిద్ధమైన ఏకో ఫ్రెండ్లీ సీడ్ గణేశా వినాయకుడి విగ్రహాల వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది అన్నారు.

పూజలు అనంతరం భూమిలో నిమజ్జనం చేయడం ద్వారా సీడ్ గణేశా లో గల విత్తనం మొక్కలుగా ఎదుగుతాయి తద్వారా పర్యావరణాన్ని కపాడిన వారం అవుతామని పేర్కొన్నారు.

మట్టితో తయారు చేసిన విగ్రహాల వల్ల ఎలాంటి హాని ఉండదని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు.

ముఖ్యంగా నీరు కలుషితమై జలచరాల ఉనికికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు.

పర్యావరణ పరిరక్షణ, చెరువుల సంరక్షణ కోసం మట్టి విగ్రహాలనే ప్రతిష్టించాలని,



పర్యావరణహితం కొరకు రసాయనాలతో చేసిన విగ్రహాలను తగ్గించి మట్టి విగ్రహాలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ కమర్తపు మురళి, నాయకులు ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, తాజుద్దీన్, కన్నం ప్రసన్న కృష్ణ, బత్తుల మురళి, తదితరులు ఉన్నారు.

# నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, ఆగష్టు 29: ఈ రోజు ఢిల్లీలో జరిగిన నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ రజతోత్సవ వేడుకల్లో కేంద్ర రసాయన, ఎరువుల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ పాల్గొన్నారు. కేంద్ర రసాయన, ఎరువులు, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీ భగవంత్ ఖూబా కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ప్రసంగించిన డాక్టర్ మాండవీయ నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ నియంత్రణ వ్యవస్థగా మాత్రమే కాకుండా వ్యవహారాలు సులభంగా జరిగే వ్యవస్థగా పనిచేస్తున్నదని అన్నారు. గత 25 సంవత్సరాలుగా ప్రజలకు నాణ్యమైన ఔషధాలు సకాలంలో, సరసమైన ధరలకు లభించేలా నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ కృషి చేస్తున్నదని మంది ప్రశంసించారు.

భారతీయ పరిశ్రమలు నిరంతరం నాణ్యమైన ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తున్నాయని కేంద్ర మంత్రి అన్నారు. వాణిజ్య ప్రయోజనాల కోసం మాత్రమే కాకుండా ప్రజల ఆరోగ్యం మరియు సంక్షేమం లక్ష్యంతో ఔషదాలు ఉత్పత్తి చేయాలని, వినూత్న పరిశోధనలను చేపట్టాలని డాక్టర్ మాండవీయ సూచించారు.

భారత ఔషధ ఉత్పత్తి సంస్థలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని డాక్టర్ మాండవీయ హామీ ఇచ్చారు. ఫార్మా రంగ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తున్న పిఎల్ఐ 1, పిఎల్ఐ 2 పథకాలను ఈ సందర్భంగా డాక్టర్ మాండవీయ ప్రస్తావించారు. ప్రభుత్వ పథకాల వల్ల కీలకమైన ఏపిఐల స్వదేశీ తయారీ ప్రారంభమైందని మంత్రి పేర్కొన్నారు. . కోవిడ్ సంక్షోభ సమయంలో భారతీయ ఫార్మా కంపెనీల నుంచి ప్రభుత్వానికి అందిన సానుకూల సహకారాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందించడంలో ప్రభుత్వం మరియు పరిశ్రమల మధ్య సహకారం మరియు సహకారం అవసరమని అన్నారు.

గత 25 సంవత్సరాలుగా దేశానికి మరియు ఫార్మా రంగానికి నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ అందిస్తున్న సేవలను శ్రీ భగవంత్ ఖూబా ప్రశంసించారు. "పరిశ్రమ ప్రయోజనాలకు హాని కలగకుండా సరసమైన మందులు లభించేలా నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ కృషి చేస్తుంది " అని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు ప్రారంభించిన రెండు అప్లికేషన్‌లతో రాబోయే సంవత్సరాల్లో నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ తన పనిని మరింత సాఫీగా మరియు సమర్ధవంతంగా కొనసాగించగలదని ఆయన తన ఆశావాదాన్ని కూడా వ్యక్తం చేశారు.

రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ 2.0 (ఎఖఆటూ 2.0) మరియు ఫార్మా సాహి దామ్ 2.0 యాప్‌ను ప్రారంభించారు.

సమీకృత ప్రతిస్పందన క్లౌడ్ ఆధారిత అప్లికేషన్ గా పనిచేసే ఎఖఆటూ 2.0 ని సెంటర్ ఫర్ అడ్వాన్స్ కంప్యూటింగ్ (అ-ఆంఅ) సాంకేతిక సహకారం తో నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ అభివృద్ధి చేసింది. డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ (ఆఖఆూ), 2013 కింద తప్పనిసరి చేసిన వివిధ ఫారమ్‌ల సమర్పణలకు ఏక గవాక్ష విధానాన్ని అందుబాటులోకి తెచ్చి సులభతర వ్యాపార నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ లక్ష్య సాధన కోసం ఎఖఆటూ 2.0 ని అభివృద్ధి చేయడం జరిగింది. నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీలో కాగిత రహిత పాలన జరిగేలా ఎఖఆటూ 2.0 సహకరిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ తో సంబంధిత వర్గాలు అనుసంధానం అయ్యే అంశాన్ని సులభతరం చేస్తుంది.

నవీకరించిన ఫార్మా సాహి దామ్ 2.0 యాప్ స్పీచ్ రికగ్నిషన్ వంటి సౌకర్యాలు కలిగి ఉంటుంది. హిందీ మరియు ఆంగ్లంలో యాప్ అందుబాటులో ఉంటుంది. షేర్ బటన్ మరియు బుక్‌మార్కింగ్ సౌకర్యాలను కూడా దీనిలో కల్పించారు. వినియోగదారుల ఫిర్యాదుల నిర్వహణ మాడ్యూల్ ద్వారా వినియోగదారు ఫిర్యాదులను ప్రారంభించే సదుపాయాన్ని కూడా యాప్ కలిగి ఉంది. యాప్ తిూా మరియు ంనిటతీనీతిట వెర్షన్‌లలో అందుబాటులో ఉంటుంది.

' యాన్ ఓవర్‌వ్యూ ఆఫ్ డ్రగ్ ప్రైసింగ్ ఏ ఔఖఖం 25 ఇయర్ ఒడిస్సీ' అనే శీర్షికతో ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. 25 సంవత్సరాల నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ సాధించిన విజయాలు, అమలు చేసిన చర్యలు, ధరల నియంత్రణకు అమలు చేసిన ప్రత్యేక చర్యలు, దేశంలో ఔషధ నియంత్రణ వ్యవస్థ యొక్క పరిణామం తదితర అంశాలను దీనిలో పొందుపరిచారు. . ఎన్‌పిపిఎ ఛైర్మన్ శ్రీ కమలేష్ పంత్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మాస్యూటికల్స్ విభాగం కార్యదర్శి శ్రీమతి ఎస్ అపర్ణ, ఎన్‌పిపిఎ మెంబర్ సెక్రటరీ డాక్టర్ వినోద్ కొత్వాల్ పాల్గొన్నారు.

ఫార్మాస్యూటికల్ మరియు మెడ్‌టెక్ పరికరాల పరిశ్రమ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైస్ మానిటరింగ్ మరియు రిసోర్స్ యూనిట్లు, సివిల్ సొసైటీ, పేషెంట్ అడ్వకేసీ గ్రూపులు, ఫార్మాస్యూటికల్ పరిశోధన, విద్యా సంస్థల ప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. .

# ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న 2003 బ్యాచ్ కానిస్టేబుళ్లు



ఖమ్మం,ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి భరోసాగావేమున్నామంటూ.. ముందుకు వచ్చి రెండు లక్షల యాభై వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా 2003 బ్యాచ్ ఏఆర్, సివిల్, కానిస్టేబుళ్లు, ఖమ్మం నగరానికి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ షేక్ సుభాన్ ఇటీవల చికిత్స పొందుతూ మృతి చెందారు.

తమతో కలసి పని చేస్తున్న తోటి కానిస్టేబుల్ ఉన్నట్టుండి కోల్పోవడం తమతో ఉన్న జ్ఞాపకాలు మర్చిపోలేని బ్యాచ్ పోలీసులంతా ఒక్కటై..అందరూ కలిసికట్టుగా ఉండి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని నిశ్చయించుకున్నారు. దీంతో అంతా ఒక్కటయ్యారు. తలా ఇంతా వేసి రెండు లక్షల యాభై వేల రూపాయలు సమకూర్చి ఫిక్సడ్ డిపాజిట్ చెక్కును మృతిని కుటుంబ సభ్యులకు అందజేసి ఆదర్శంగా నిలిచారు.

కార్యక్రమంలో ఖానాపురం హవేలీ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, టాస్కోఫర్స్, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు రామయ్య, సర్వర్ ఖాన్, మల్లేష్, గజేంద్ర, తోటి నారాయణమూర్తి, శ్రీనివాసరావు, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళకై వినతుల వెల్లువ



మెదక్, ఆగష్టు 29: నేటినిజం (ప్రతినిధి ):సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కావాలని అత్యధిక సంఖ్యలో వినతులు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమానికి 66 వినతులు రాగా అందులో 40 వినతులు డబుల్ బెడ్ ఇళ్ల మంజూరికి వచ్చినవే.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేష్ ఫిర్యాదారులనుద్దేశించి మాట్లాడుతూ మెదక్ నియోజక వర్గంలో వేయి ఇళ్ల మంజూరుకు గాను ఇంతవరకు 500 మంది లబ్దిదారులకు అందజేశామని త్వరలో అర్హులైన లబ్దిదారులను పారదర్శకంగా గుర్తించి మిగిలిన మరో 500 ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు.

ఆ తరువాత ఆసరా పింఛన్ల మంజూరు గురించి కూడా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పింఛను మంజూరికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని అన్నారు. ప్రజావాణిలో రేషన్ కార్డుల మంజూరు, భూ సమస్యలు తదితర ఫిర్యాదులకు సంబంధించి 26 వినతులు రాగా సంబంధిత శాఖాధికారులకు అందజేస్తూ పరిష్కరించ దగ్గ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సాధ్యం కాని వాటిపై వారికి తగు సూచనలు ఇవ్వాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషద్ సీఈఓ శైలేష్, డి.ఎస్.ఓ. శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు,డి.ఎస్.డి.ఓ. విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి ఆశా కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు గంగయ్య, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మెదక్, ఆగష్టు 29: నేటినిజం ప్రతినిధి):రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రాష్ట్ర రహదారుల ఇంజనీరింగ్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవలసినదిగా అదనపు కలెక్టర్ రమేష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో అదనపు ఎస్పీ బాలస్వామితో కలిసి సమీక్షిస్తూ ఏటా ప్రమాదాల సంఖ్య పెరుగుతుండడంతో పాటు క్షతగాత్రులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు అధికంగా మలుపులు ఉండడం, ప్రమాద హెచ్చరికలు, స్పీడ్ నియంత్రణ సూచికలు, స్పీడ్ బ్రేకర్లు అవసరమైన చోట లేకపోవడం, యూ టర్న్ ల వద్ద గడ్డి, చెత్త మొలచి మలుపులు కనిపించకపోవడం, అతివేగం తదితర కారణాలవల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని అన్నారు. మనోహరాబాద్ నుండి తూప్రాన్ , చేగుంట, రామాయంపేట జాతీయ రహదారితో పాటు నరసాపూర్ -మెదక్ రహదారి వెంట గుర్తించిన బ్లాక్ స్పాట్ ల వద్ద ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఇందుకు పోలిసు యంత్రాంగం పూర్తిగా సహకరికిస్తుందని అన్నారు. కొల్చారం వద్ద మలుపు పెద్దగా ఉన్నందున స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలనీ, బ్యారీ కేడింగ్ తొలగిన చోట తిరిగి ఏర్పాటు చేయాలని, కిష్టాపూర్ వద్ద ప్యాడి సీజన్ లో ట్రాక్టర్లు సడన్ గా ప్రధాన రహదారి పైకి దూసుకువస్తున్నాయని, స్పీడ్ నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని రమేష్ అధికారులకు సూచించారు. రహదారుల వెంట పాఠశాల ఉన్న దగ్గర సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. కొల్చారం వద్ద ప్రమాదం జరిగినపుడు తాను వెంటనే స్పందించి 108 అంబులెన్స్ కు ఫోన్ చేసిన గంట తరువాత రావడం జరిగిందని, ఇది పునరావృత్తం కాకుండా చూడాలని అన్నారు. ప్రమాదం జరిగిన తక్షణమే వైద్య సహాయం అందిస్తే క్షతగాత్రుల ప్రాణాలు రక్షించిన వారమవుతామని అన్నారు. రహదారుల వెంట బయో వాష్ రూమ్ లు ఏర్పాటు చేయాలని, రోడ్లపై నీరు నిలువకుండ చూడాలని అధికారులకు సూచించారు. అదనపు ఎస్పీ బాలస్వామి మి మాట్లాడుతూ జిల్లాలో మూడు జాతీయ రహదారులు ఉన్నాయని, కానీ సరైన సూచిక బోర్డులు లేక, డ్రైవర్ల తప్పిదాలు, అతివేగం, మార్గం సరిగ్గా కనిపించక పోవడం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ పెట్టుకోకపోవడం తదితర కారణాలవల్ల ప్రమాదాలు జరుగుచున్నాయని అన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే పోలీసులతో పాటు రహదారుల ఇంజనీరింగ్ అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించి ప్రమాద కారణాలు తెలుసుకుంటే రోడ్డు నిర్వహణలో లోపాలను అధిగమించవచ్చని అన్నారు. గత సంవత్సరం 504 రోడ్డు ప్రమాదాలు జరిగితే ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 331 ప్రమాదాలు జరిగి 189 మంది చనిపోవడం భాదాకరమని అన్నారు. ప్రధానంగా జాతీయ రహదారుల వెంటే అధిక ప్రమాదాలు జరుగుచున్నాయని, అధికారులు ప్రమాదాలకు గల కారణాలను తెలుసుకొని వాటి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. వడియారం దగ్గర, చేగుంట దగ్గర స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని, సర్వీస్ రోడ్డు కనెక్ట్ అయ్యే దగ్గర సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అండర్ పాస్ ల దగ్గర నీరు నిలువ ఉండకుండా చూడాలని, మలుపులు స్పష్టంగా కనిపించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రవాణాధికారి శ్రీనివాస్ గౌడ్, జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, జిల్లా విద్యా శాఖాధికారి రమేష్ కుమార్, జిల్లా ఆబ్కారీ అధికారి రజాక్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులను ప్రతిష్టించి, పర్యావరనాన్ని కాపాడాలి- జిల్లా కలెక్టర్ యస్. క్రిష్ణఆదిత్య.



ములుగు , ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి, పర్యావరనాన్ని ప్రతి ఒక్కరు కాపాడాలని జిల్లా కలెక్టర్ యస్. క్రిష్ణఆదిత్య జిల్లా ప్రజలను కోరారు.

జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అద్వర్యంలో కుమ్మర వర్గాలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారి జీవనోపాదికై వినాయక చవితి పండగ సందర్భంగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేయించి కాలుష్య నియంత్రణ బోర్డు ద్వారా కొనుగోలు చేసి జిల్లాలో వెయ్యి మట్టి గణపతి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లో మట్టి గణపతి విగ్రహాలను ప్రజలకు, అధికారులకు జిల్లా కలెక్టర్ అందజేశారు.

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వై వి గణేష్, డి ఆర్ ఓ రమాదేవి, కలెక్టరేట్ ఎ.ఓ. విజయ భాస్కర్, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి, బిసి అభివృద్ధి సంక్షేమ అధికారి యస్. లక్ష్మణ్ , కుమ్మరి సంఘం నాయకులు ఆషాడపు దేవిందర్, కొత్తపల్లి బాబురావు, కలెక్టరేట్, ఆర్డి ఓ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ములుగు జిల్లా ఈ రోజు తాడ్వాయి మండల కేంద్రంలో ఐటిడిఏ ద్వారా మంజూరైన కమ్యూనిటీ కిచెన్ షెడ్డు ను మరియు రెవెన్యూ గెస్ట్ హౌస్ ను మంత్రి సత్యవతి రాథోడ్ గారితో కలిసి ప్రారంభించిన ములుగు ఎమ్మెల్యే సీతక్క గారు

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులు,ఎంపీటీసీ లు మాజీ జెడ్పీటీసీ లు మాజీ ప్రజా ప్రతినిధి లు తదితరులు పాల్గొన్నారు

# జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): భారత హాకీ అనగానే అందరికి గుర్తుకొచ్చేది మేజర్ ద్యానంద్ అని మరియు వారు చేసిన సేవలు చాలా చారిత్రాత్మకమైనవని , వెలకట్టలేనివని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాకులు శ్రీ వి . మల్లారెడ్డి గారు స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ – టెక్నో స్కూల్లో వేడుకగా నిర్వహించినటువంటి ద్యానంద్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు . అంతకుముందు వారు ప్రాంగణంలోఏర్పాటుచేసినటువంటి ద్యాన చంద్ చిత్రపటానికి ఘనంగా పుష్పాంజలి ఘటించి వారు చేసిన సేవలను స్మరించుకొని కొనియాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . భారతదేశ క్రీడారంగానికి వారు చేసిన కృషి ప్రత్యేకంగా హాకీ క్రీడకు ప్రాచుర్యం తేవడంలో కీలక పాత్ర పోషించి హాకీ క్రీడకు నిర్వచనంగా మారారని వారు చెప్పారు . వారి అకుంఠిత దీక్షతో భారతహాకీకి ఎన్నో మైలు రాయిలు దాటిందని ప్రత్యేకంగా హాకీ క్రీడకు వన్నె తెచ్చారని మరియు వివిధ స్థాయిలలో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను రెట్టింపు చేశారని గుర్తు చేశారు . తనదైన శైలిలో , పోరాట పటిమతో చాలా కృషి చేసి వరుసగా మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారని హర్షం వ్యక్తం చేస్తూ అతితక్కువ సమయంలోనే భారత క్రీడారంగానికి దిక్సూచిగా మారి అఖండ విజయాలను నమోదు చేశారని గుర్తు చేశారు . నేటికి వారి క్రీడా విధానాలను మరియు పద్ధతులను చాలా దేశాల్లో ఆచరిస్తుంటారని మరియు మన దేశంలో వారిని చాలా ఆదర్శంగా తీసుకుంటారని కొనియాడారు . ఒలంపిక్ క్రీడల్లో వారు ప్రదర్శించిన ఆట తీరు నేటికి భారతీయుల్లో ఒక మధురానుభూతిగా ఉండిపోయినదని తెలుపుతూ వారి సేవలను గౌరవిస్తు వారు అందించిన విజయాలకు గౌరవంగా కేంద్ర ప్రభుత్వం వారి గౌరవార్ధమై వారి పేరు మీద క్రీడాకారులకు అవార్డులను ప్రదానం చేస్తున్నారని చెప్పారు . ప్రతి ఒక్కరు వారు చూపిన మార్గాన్ని అనుసరించాలని తెలుపబడినటువంటి మార్గదర్శకాలను పాటించి ఘనవిజయాలను నమోదు చేయాలని మరియు చరిత్రను తిరగరాయాలని కోరారు . వేడుకలలో భాగంగా విద్యార్థులకు ప్రదర్శించినటువంటి మహనీయుడు ద్యానంద్ మరువదు నిన్ను లోకం , నాటిక చాలా ఆలోచింపచేసింది . ద్యానంద్ అమరహే , ద్యానంద్ కి జై నినాదాలతో ప్రాంగణం మారుమోగింది మరియు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచడంలో కీలకంగా వ్యవహరిస్తున్నా వ్యాయమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు .

## జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా క్రీడాదినోత్సవం వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): భారత హాకీ దిగ్గజం, మేజర్ ధ్యాన్ చాంద్ జయంతి ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వేములవాడ లో జాతీయ క్రీడా దినోత్సవం ను కన్నుల పండుగ గా జరుపుకున్నారు.. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. సుహాసిని మాట్లాడుతు క్రీడల ద్వారా శారీరక, మానసిక వికాసం జరుగుతుంది అని, ప్రతి విద్యార్థి చదువు తొ పాటు, ఆటలలో నైపుణ్యం సాధించాలి అని పేర్కొన్నారు.. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ శ్రీనివాస్ ధ్యాన్ చాంద్ జీవిత విశేషాల ను కళ్ళకు కట్టినట్లు వివరించారు. ధ్యాన్ చాంద్ జీవితం క్రీడాకారులందరికి ఆదర్శ ప్రాయం అన్నారు... తదుపరి విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలు అందరిని అలరించాయి.. అలాగే ఇదే సందర్భంగా తెలుగు దినోత్సవం ను కూడా ఘనంగా జరుపుకున్నారు.. ఈ కార్యక్రమం లో పాఠశాల సిబ్బంది వ్యాయామ ఉపాధ్యాయులను, తెలుగు భాష ఉపాధ్యాయుల ను సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ బృందం జయశ్రీ, జయంత్ శర్మ, యాదగిరి, బొజ్జ కృష్ణ, హరి కృష్ణ, నర్మదా, మాదవి, రాధికా, సరోజ, సరళ, సవిత, సావిత్రి సిఆర్పీ ఆకుల శ్రీనివాస్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..

## ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సాహించాలి

### – కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): ప్రతిభ గల క్రీడాకారులనుప్రోత్సాహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కృష్ణవేణి టాలెంట్ కరస్పాండెంట్ శ్రీ సన్నిధి వెంకటకృష్ణ పిలుపు నిచ్చారు. సోమవారం జాతీయ క్రీడా దినోత్సవం తో పాటు మాతృభాషా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ ఫోటో కు పూలమాలలు వేసి కరస్పాండెంట్ ,ప్రిన్సిపల్ నివాళులుఅర్పించారు. అనంతరం నీ సన్నిధి వెంకటకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు . క్రీడాకారులు లక్ష్యంగా జాతీయ క్రీడాకారులుగా ఎదుగదానికిమానసిక ఉల్లాసంతో క్రీడా పోటీల్లో పాల్గొనాలని అన్నారు. మానసిక ఉల్లాసంతో క్రీడల్లో ఎంతో ఉపయోగపడతాయని అన్నారు .ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కళ్యాణ్ కుమార్ ,స్కూల్ ఇన్చార్జ్ అనిల్ ,ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు తదితరులు .ఇతర క్రీడా దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు .గెలుపొందిన విద్యార్థుల కు కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు

## ముంపు గ్రామాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): ముంపు గ్రామాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి అన్నారువేములవాడ పట్టణంలో ముప్పు గ్రామాలకు మద్దతుగా సోమవారం కమాన్ దగ్గర వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ ముప్పు గ్రామాల సమస్యలు 8 సంవత్సరాలు అవుతున్న వారికి సరైన వసతులు ఆదుకునే దానిలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధర్నా చేసి మా హక్కులను మేము మాట్లాడ అర్హత లేకుండా పోలీసు వారితో భగ్నం చేసి ఎక్కడున్నా అక్కడ అరెస్టు చేయడం ఇది నియంత పాలనగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ పార్టీ ముప్పు గ్రామాల ప్రజలకు ఎప్పుడు మద్దతుగా ఉంటదని మాట్లాడడం జరిగినది ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్ కాంగ్రెస్ చందుర్తి మండల అధ్యక్షులు రామస్వామి,రాజన్న గుడి మాజీ ట్రస్టు బోర్డు మెంబర్ అరుణ్ తేజ చారి కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు తోటలహరి తో పాటు పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డా ॥వి .నరేందర్ రెడ్డికి అత్యుత్తమ చైర్మన్ పురస్కారం




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): లయన్స్ క్లబ్ అధ్యక్షుడు , ఆల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి కి అత్యున్నతమైన చైర్మన్ పునస్కారంలభించింది .సోమవారం శాతవాహన లయన్స్ క్లబ్ కార్యక్రమాల సమన్వయకర్త లయన్ డాబి. మధుసూధన్ రెడ్డి స్థానిక ఒక ప్రైవేట్ వేడుక మందిరంలో పూర్వపు అధ్యక్షులు లయన్ డా వి . నరేందర్ రెడ్డి కి అత్యుత్తమ చైర్మన్ పురస్కారం లభించడంపట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక సమావేశానికి వారు హాజరై మాట్లాడారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం శాతవాహన లయన్స్ క్లబ్ కార్యకలాపాలు ఆరంభం నుండి వివిధ రకాల కార్యక్రమాలను అన్ని రంగాలలో విశిష్ట సంఖ్యలో చేపట్టడమే కాకుండా ఇతర క్లబ్లు ధీటుగా అత్యధికంగా సంక్షేమ కార్యక్రమాలతోపాటు యువతలో చైతన్యమే లక్ష్యంగా పలు సందేశాత్మక కార్యక్రమాలను నిర్వహించడంలో విజయవంతులైనారని వారు చెప్పారు . నేడు శాతవాహన లయన్స్ క్లబ్ కు ప్రత్యేకత ఉన్నదని మరియు క్లబ్ సభ్యుల్లో ఉత్సాహం పెరిగిందని అందుకు ప్రధాన కారణం నరేందర్ రెడ్డి అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని వారు చెప్పారు . ప్రత్యేకంగా అనాధలకు చేయూతనివ్వడం , వృద్ధులకు ఆసరా ఇవ్వడం , విద్యార్థులకు చైతన్యం కల్పించడం , మహిళల్లో భద్రతాభావాన్ని పెంచడం , హరితహారం కార్యక్రమం , కాల్యుష నివారణ కార్యక్రమాలు ప్రత్యేకంగా సైక్లింగ్ పోటీలు , 2 కె రన్ నిర్వహణ , వివిధ సందర్భాలలో వైవిధ్యభరితమైన కార్యక్రమాలు మరియు క్లబ్ సభ్యుల జన్మదిన రోజున అనాధాశ్రమంలో అన్నదానం నిర్వహించడం చాలా అభినందనీయమని చెప్పారు . పలు సంక్షేమ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదకాన నిర్వహించడమే కాకుండా ఇతర సంస్థలకు చేయూతనిచ్చి ఆదర్శంగా నిలిచారని కేవలం యేదాది కాలం వ్యవధిలోనే చాలా గొప్ప సంఖ్యల్లో కార్యక్రమాలను నిర్వహించినందుకు నిన్న సాయంకాలం హైద్రాబాద్ లోని ఒక ప్రవేట్ వేదిక మందిరంలో నిర్వహించినటువంటి ఒక ప్రత్యేక సమావేశంలో అంతర్జాతీయ 3 వ ఉపాధ్యకులు లయన్ ఎ.పి.సింగ్ చేతుల మీదుగా అత్యుత్తమ అధ్యక్షునిగా అవార్డు స్వీకరించడం జరిగినదని హర్షం వ్యక్తం చేశారు . విద్యారంగంతో పాటు సామాజిక కార్యక్రమాలలో కూడా ఘనవిజయాలను సాధించడం చాలా గర్వకారణమని మరియు ఆదర్శనీయమైని చెప్పారు . ఈ కార్యక్రమంలో లయన్ యం . సత్యనారాయణ రావు , లయన్ డా.యన్.మనోహర చారి , లయన్ బి . నర్సింగరావు , లయన్ అరవింద్ బాబు , లయన్ ఇ.రమేష్ , లయన్ వి.జగదీశ్వర చారి , పలు సంఘాల ప్రతినిధులు , పాఠశాలల యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు .

## ఆసరా పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ



ఖమ్మం,ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): కొత్తగా 10 లక్షల ఆసరా పెన్షన్లు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ మంజూరు చేసిన దృష్ట్యా జిల్లాలో నూతంగా మంజూరైన ఆసరా పెన్షన్లను లబ్ధిదారులకు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్వయంగా అందజేశారు. శాంతినగర్ లోని ఏఎస్ ఆర్ జూనియర్ కళాశాల నందు 22, 23, 24, 25, 26 ం 37 డివిజన్ల లబ్దిదారులకు కొత్త పెన్షన్ ఆర్డర్లు ం కార్డులను మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారు పంపిణీ చేశారు.

వర్తక సంఘం భవనంలో 32, 33, 34 ం 36 డివిజన్‌ల లబ్ధిదారులకు కొత్త పెన్షన్ ఆర్డర్లు ం కార్డులు పంపిణీ చేశారు.

గట్టయ్య సెంటర్ లోని ఫ్రీడమ్ పార్క్ ప్రాంగణంలో 50, 51, 52 ం 53 డివిజన్‌ల లబ్ధిదారులకు పెన్షన్ ఆర్డర్స్ ం కార్డ్స్ పంపిణీ చేశారు.

జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్లు, అధికారులు ఉన్నారు..

## విశ్వ ఆత్మబంధువులకు వినాయక చవితి శుభాకాంక్షలు

### – ప్రకృతిని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని గుర్తించాలి
### – మట్టి వినాయకున్నే పూజిద్దాం – ప్రమాద కమైన వాటిని దూరం చేద్దాం
### – పాల్వంచ బ్రహ్మకుమారి పద్మజ పిలుపు



భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 29 (నేటి నిజం ప్రతినిధి) : భద్రాద్రి జిల్లా పాల్వంచ రాజయోగ మెడిటేషన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రహ్మకుమారి పద్మజ మాట్లాడుతూ విశ్వ ఆత్మలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి పండుగను అందరం ఎంతో ఆనందంగా సంతోషంగా జరుపుకోవడం జరుగుతుంది

వినాయక చవితి పండుగ మాత్రం చిన్న పిల్లలు దగ్గర నుండి పెద్ద వయస్సు వరకు ఎంతో ఉత్సవంగా జరుపుకోవడం మనకందరికీ తెలిసిన విషయమే అందులో భాగంగానే కొన్ని జాగ్రత్తలు తీసుకొని పూజలు చేసుకునే విధానంలో కొన్ని మార్పుల వల్ల ప్రకృతికి, మానవులకు ఎలాంటి నష్టం జరగదు అని ఆమె తెలిపారు.

తప్పని సరిగా మట్టి వినాయక విగ్రహంను పూజించాలి.

ఇండ్లల్లోను పసుపుతోను బియ్యపు పిండితో చేసిన వాటిని కూడా తయారు చేసుకొని పూజలు చేసుకోవచ్చు అని ఆమె అన్నారు.

ఇలా చేయడం వల్ల ప్రకృతిని కాపాడటమే కాదు సృష్టిని రక్షించి సమాజంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కూడా కాపాడిన వాళ్ళం అవుతమని పద్మజ తెలిపారు.

ప్రకృతిని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలి.

వినాయక చవితి పండుగ వచ్చింది అంటే యువకులు విద్యార్థులు ఎంతో హాడవుడి చేస్తుంటారు. తొందరపడి పొరపాట్లు చెయ్యొద్దని కొంచం అజాగ్రత్తగా ఉండటం వల్ల ఎంతో మంది తమ ప్రాణాలను కూడా పోగొట్టుకున్న సంగతి ప్రతి సంవత్సరం చూస్తున్నాము.

మండపాలు నిర్మించిన దగ్గర నుండి నిమజ్జనం చేసే వరకు విద్యుత్ తో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందుగా జాగ్రత్తలు వహించాలని ఆమె కోరారు.

పండుగలు అంటే సంతోషాన్ని మిగాల్చాలి కానీ విషాదాన్ని కాదు అని విధుల్లో పెట్టుకునే వాళ్ళు కూడా చుట్టూ ఉన్న కుటుంబాలను సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని ఎక్కువ సౌండ్స్ పొల్యూషన్ లేకుండా ఉంటే మంచిదని అవగాహన కల్పించారు. మెడిటేషన్ తోనే సాధ్యం ఈ బిజీ లైఫ్ లో ఈజీగా సమస్యలు ఎలా అధిగమించాలి అనే విషయాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని దాని కోసం మెడిటేషన్ ద్వారా ఆత్మ జ్ఞానాన్ని పొందుటవల్ల సాధ్యం అవుతుంది అని ఆమె తెలిపారు.

## జూరాలకు భారీగా ఇన్‌ఫ్లో.. 37 గేట్లు ఓపెన్ చేసి దిగువకు నీటి విడుదల

న్యూఢిల్లీ, ఆగష్టు 29: కర్నాటక, ఆ ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణా నదికి భారీగా వరద వస్తోంది. దీంతో కన్నడ ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. కాగా, తెలంగాణలో జూరాల ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వస్తున్న ఇన్?ఫ్లోలతో ప్రాజెక్టు తొణికిసలాడుతోంది. దీంతో ఇన్‌ఫ్లోల ఆధారంగా జూరాల నుంచి దిగువన ఉన్న శ్రీశైలం డ్యామ్‌కి నీటిని విడుదల చేస్తున్నారు.

ఇవ్వాల (ఆదివారం) ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 1.85 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ప్రాజెక్టు నుంచి దిగువకు 1.91 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కుడి, ఎడమ హైడల్? పవర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం జూరాల ప్రాజెక్టు కెపాసిటీ 8.98 టీఎంసీలు కాగా, లైవ్ కెపాసిటీ 5.28 టీఎంసీలుగా ఉంది. 37 స్పిల్? వే గేట్లు ఓపెన్ చేసి 1.52 లక్షల క్యూసెక్కుల నీటిని రిలీజ్ చేస్తున్నారు. పవర్ హౌస్‌కి 36వేల క్యూసెక్కులు, కోయిల్ సాగర్ 315, లెఫ్ట్ మెయిన్ కెనాల్ 920, రైట్ మెయిన్ కెనాల్?, 640, ప్యారలాల్ కెనాల్ 350, భీమా2కు 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

## భద్రాచలంలో రూ.1.18 కోట్ల విలువ చేసే గంజాయి సీజ్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగష్టు 29: భద్రాచలంలో భారీ స్థాయిలో గంజాయి పట్టుబడింది. రూ. 1.18 కోట్ల విలువ చేసే 594 కేజీల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఈ సందర్భంగా ఏఎస్పీ బీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ.. ఆదివారం రోజు భద్రాచలం ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద ఎస్ఐ మధు ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయన్నారు. అనుమానాస్పదస్థితిలో వెళ్తున్న ఓ రెండు కార్లను పోలీసులు ఆపడంతో.. అందులో ఉన్న వ్యక్తులు పరారీ అయ్యారు. ఒక్కరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇక కార్లలో ఉన్న 594 కేజీల గంజాయిని సీజ్ చేశారు. పట్టుబడ్డ వ్యక్తిని సారపాకకు చెందిన అన్వేష్‌గా గుర్తించారు.

ఒడిశా నుంచి చెన్నైకి గంజాయిని తరలిస్తున్నట్లు అన్వేష్ పోలీసులకు తెలిపాడు. రాము, మహేందర్ గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నాడు. తమిళనాడులో జయ కుమార్ అనే వ్యక్తికి గంజాయిని విక్రయిస్తున్నట్లు తేలింది. పరారైన కుమార్, ప్రవీణ్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఇంటి వద్దనే వినాయక నిమజ్జనం.. జీవీఎంసీ వినూత్న ప్రయత్నం

అమరావతి, ఆగష్టు 29: వినూత్నంగా వినాయక నిమజ్జనం చేపట్టేందుకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) శ్రీకారం చుట్టింది. బొజ్జ గణపయ్య విగ్రహాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనం చేసేందుకు మొబైల్ ట్యాంకులను ప్రవేశపెట్టింది. కృత్రిమ ట్యాంకుల ట్రయల్ రన్ ముగిసిన తర్వాత వాటిని విశాఖ నగరంలోని వివిధ ప్రదేశాల్లో అందుబాటులో ఉంచి ఇళ్లలో ప్రతిష్ఠించి పూజించిన గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడంలో సహాయపడాలని ప్రయత్నిస్తున్నారు.

గ్రేటర్ విశాఖ పరిధిలోని అన్ని మండలాలను కలుపుతూ 16 కృత్రిమ మొబైల్ నిమజ్జనం ట్యాంకులు నిలిపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అవసరాన్ని బట్టి వీటి సంఖ్యను పెంచనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ జీ లక్ష్మీశ చెప్పారు. తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ రకం ట్యాంకులతో వినాయక నిమజ్జనం సులభమవనున్నది. ఇదే సమయంలో నగరంలో ట్రాఫిక్ సమస్యలతో పాటు కాలుష్యం స్థాయిని క్రమబద్ధీకరించడం సాధ్యమవనున్నది.

మొబైల్ నిమజ్జనం కోసం కృత్రిమ ట్యాంక్‌లను సిద్ధం చేశారు. 10చీ16 క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో భారీ వాహనాలను ఇందు కోసం తీర్చిదిద్దారు. వీటిని నీటితో నింపి ఆగస్టు 31 నుంచి వివిధ పాయింట్లలో ఉంచనున్నారు. బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో ఇలాంటి పర్యావరణ అనుకూల నిమజ్జన పద్ధతులను అనుసరిస్తున్నారని, విశాఖలో ఇదే మొదటిసారి అని మున్సిపల్ కమిషనర్ లక్ష్మీశ పేర్కొన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసి సముద్రాన్ని కలుషితం చేయకుండా నిలువరించేందుకు ఈ వినూత్న విధానానికి శ్రీకారం చుట్టినట్లు ఆమె తెలిపారు. విశాఖపట్నం ప్రజానీకాన్ని ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా కార్పొరేషన్ సెల్ఫీ పోటీని కూడా అందుబాటులోకి తెచ్చింది. మట్టి విగ్రహాలతో గణపతిని పూజించిన వారు సెల్ఫీ దిగి పంపి బహుమతులు గెలుచుకోవచ్చునని జీవీఎంసీ అధికారులు వెల్లడించారు.

## ఆప్ ఎమ్మెల్యేలు నిజాయితీ పరులు.. బీజేపీ ఆపరేషన్ కమలం విఫలం : కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఆగష్టు 29: ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ప్రభుత్వం సోమవారం ఢిల్లీ శాసన సభ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సభలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. అయితే, సభలో బీజేపీ సభ్యులు నినాదాలు చేయగా.. వారికి వ్యతిరేకంగా ఆప్ సభ్యులు సైతం బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీపై సీఎం అరవింద్ కేజ్రీవాల్ ధ్వజమెత్తారు. సభలో బీజేపీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరును ఖండించారు. బీజేపీ ఎమ్మెల్యేలు విషయాలు చర్చకు రాకుండా.. రచ్చ చేయాలనే ఉద్దేశంతోనే సభకు వస్తున్నారని ఆరోపించారు.

దేశంలో ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరుకుందని, ప్రజలు ఇళ్లలో భోజనం చేయడం కష్టంగా మారిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి విషయంలోనూ పన్ను విధించిందని, ఇంత పన్ను ఎప్పుడూ లేదని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాలు, పెరుగు, తృణధాన్యాలు, పప్పులు, బియ్యం, పంచదారపై ఎప్పుడూ పన్ను విధించలేదని, బ్రిటిషర్లు సైతం పన్ను విధించలేదంటూ మండిపడ్డారు.

ఆప్ ఎమ్మెల్యేలు నిజాయితీపరులని, అందుకే ఒక్క ఎమ్మెల్యే సైతం అమ్ముడుపోలేదని, ఢిల్లీలో బీజేపీ ఆపరేషన్ కమలం విఫలమైందని కేజ్రీవాల్ అన్నారు. ప్రజల్లో విశ్వాసం కల్పించేందుకే.. తమ పార్టీ ఎమ్మెల్యేలు అమ్ముడు పోలేదన్నారు. అందుకే సభలో విశ్వాస తీర్మానం పెట్టామని చెప్పారు. వారు చాలా రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టారని, జార్ఖండ్‌లో ప్రభుత్వాన్ని గద్దెదించే పనిలో కేంద్రం నిమగ్నమైందని ఆరోపించారు. డీజిల్, పెట్రోల్ ధరలను పెంచి డబ్బు సమకూరుస్తోందంటూ ఆరోపించారు. పెట్టుబడిదారులకు రూ. 10వేలకోట్లు రుణమాఫీ చేశామని కేంద్రం ఇటీవల పార్లమెంట్‌లో అంగీకరించిందని కేజ్రీవాల్ అన్నారు. అప్పులతో రైతులు సతమతమవుతుంటే.. వారి రుణా మాత్రం మాఫీ కావడం లేదని, భూమిని అటాచ్ చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల రుణాలు సైతం మాఫీకాక.. అప్పులు తీర్చేందుకు వారి తల్లిదండ్రులు వ్యవసాయ భూములను తాకట్టు పెడుతున్నారన్నారన్నారు. ఇదిలా ఉండగా.. లెఫ్టినెంట్ గవర్నర్‌పై ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్ పలు ఆరోపణలు గుప్పించారు. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో ఎల్‌జీ రూ. 1400కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని పాఠక్ ఆరోపించారు. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. సభలో పాఠక్ చేసిన ప్రకటనకు ఆప్ ఎమ్మెల్యేలు మద్దతు పలికారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com